జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php



నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకుంటున్నారా?

మీ ఏరియాలోని ప్రజల సమస్యలకు మీ కలం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలనుకుంటున్నారా? ఇంకెందుకు ఆలస్యం...? మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి....

ప్రజాపాలన తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా, మండలాల వారీగా విలేకరులను ఆహ్వానిస్తుంది

అర్హత : నిజాన్ని నిర్భయంగా చెప్పగలిగే సత్తా ఉండాలి

వివరాలకు ఈ క్రింది నెంబర్లలో సంప్రదించండి..:

సెల్ : 8886022523, 9000621111,9848725373



సంపుటి 16 సంచిక 104 విశాఖపట్నం | గురువారం 07 డిసెంబరు 2023 | 8 పేజీలు | వెల : 5.00


# అధైర్యపడొద్దు..

## రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది: జగన్



తాడేపల్లి : ఏపిలో తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా తుపాను ఎఫెక్ట్, పునరావాస చర్యలు, నష్టం అంచనాలు, తదితర అంశాలపై ముఖ్యమంత్రి చర్చించారు. ఈ సందర్భంగా సిఎం జగన్ మాట్లాడుతూ ప్రస్తుతం తుపాను బలహీనపడి అల్పపీడనంగా మారిందని, తుపాను వల్ల భారీ వర్షాలు పడ్డాయని అన్నారు. అధికారులంతా వారివారి ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులను తీసుకు రావడంపై దఅష్టిపెట్టాలన్నారు. బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని చెప్పారు. రుణ సాయం ఎక్కువైనా ఫర్వాలేదు, వారికి మంచి సహాయం అందాలని అన్నారు. దెబ్బతిన్న ఇళ్ల విషయంలో కానీ, క్యాంపుల నుంచి ప్రజలు తిరిగి వెళుతున్న సందర్భంలో కానీ, వారికి ఇవ్వాల్సిన సహాయం వారికి ఇవ్వాలని అన్నారు. రేషన్ పంపిణీలో కూడా ఎలాంటి లోపం ఉండకూడదని చెప్పారు. పంట పొలాల్లో ఉన్న వరదనీటిని పూర్తిగా తొలగించడంపై దృష్టిపెట్టాలన్నారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని.. వారు అధైర్యపడాల్సిన పనిలేదని సిఎం అన్నారు. పంటల రక్షణ, తడిసిన ధాన్యాన్ని, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం దగ్గర నుంచి అన్నిరకాలుగా తోడుగా ప్రభుత్వం ఉంటుందన్నారు. సబ్సిడీపై విత్తనాల సరఫరాకు అన్ని రకాలుగా సిద్ధం కావాలని సూచించారు. యుద్ధప్రాతిపదికన విద్యుత్‌ను పునరుద్ధరించాలని ఆదేశించారు. రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో రవాణా పునరుద్ధరణకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై దృష్టిపెట్టాల న్నారు. చెట్టుకూలి చనిపోయిన కానిస్టేబుల్ కుటుంబాన్ని కూడా ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. ఆ కుటుంబానికి రూ.30 లక్షల సహాయాన్ని అందిస్తామని ప్రకటించారు.


## విపక్ష ఇండియా కూటమి భేటీపై మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు



కోల్‌కతా : విపక్ష ఇండియా కూటమి భేటీకి గైర్హాజరవుతారని భావిస్తున్న పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ఎప్పుడైతే సానుకూల తేదీతో ముందుకొస్తే విపక్ష నేతలు త్వరలోనే సమావేశమవుతారని తదుపరి భేటీని ప్రస్తావిస్తూ పేర్కొన్నారు. తనకు ఇండియా కూటమి సమావేశం గురించి ముందుగా సమాచారం ఇవ్వలేదని, కేవలం సోమవారమే రాహుల్ ఫోన్ చేసి భేటీ గురించి చెప్పారని దీదీ తెలిపారు.వారు ఎప్పుడు సమావేశం గురించి నిర్ణయస్తే తామంతా త్వరలోనే కలుస్తామని ఆమె పేర్కొన్నారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్స్ ప్రకారం పర్యటనలు ఉంటాయని చెబుతూ సీఎంలకు కనీసం వారం, పది రోజులు ముందుగా సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు.

## 2024-25 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలు 14లోగా సమర్పించాలి..

### ఆర్థిక శాఖ ఉత్తర్వులు




అమరావతి, : రాష్ట్రంలో అమలవుతున్న నవరత్నాల పథకాలతోపాటు కేంద్ర పథకాలకు సంబంధించి 2024-25 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలను ఈ నెల 14లోగా ఆన్‌లైన్‌లో పంపాలని ఆర్థిక శాఖ సూచించింది. మహిళలు, బాలికలకు ప్రత్యేకంగా జెండర్ బడ్జెట్‌కు ప్రతిపాదనలను సమర్పించాలని కోరింది. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సంక్షేమానికి ఉప ప్రణాళికలను ప్రతిపాదించాల్సిందిగా ఆయా శాఖలను ఆదేశించింది. ప్రధానంగా రహదారులు, గృహాలు, తాగునీరు, విద్య, ఆరోగ్యం వంటి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. (మిగతా 2లో..)

# టోర్నడో బీభత్సం.. మిచాంగ్ తుది విన్యాసం

**ఆంధ్రప్రదేశ్‌లో కలవరం..**

**గాలిలో ఆటోలు.. లారీలు గిరగిర..**

**ఉభయగోదారి జిల్లాలకు అమెరికా అనుభవం**

**భయంతో పరుగులు తీసిన జనం**

**గాల్లోకి లేచిన ఆటోలు.. దారికడ్డం తిరిగిన లారీలు**

**విరిచుకుపడ్డ పెద్ద పెద్ద వృక్షాలు**

**కొట్టుకుపోయిన ఇంటి రేకులు, పైకప్పు**

**ఇంటికప్పు కూలి బుట్టాయగూడెంలో ఇద్దరు మృతి**



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో మైచాంగ్ బీభత్సం సృష్టించింది. అమెరికా తరహాలో టోర్నాండోల అనుభవాన్ని ఏపీ ప్రజలు చూశారు. ఇది చూసిన జనం భయంతో పరుగులు పెట్టేశారు. అకస్మాత్తుగా భీకర సుడిగాలి జనం గుండెల్లో కలవరం సృష్టించింది. ఉభయ గోదావరి జిల్లాల్లో ఈ సుడిగాలి వికటట్ట హాసంతో కరాళ నృత్యం చేసింది. కోనసీమ జిల్లాలోని గండేపల్లి మండలం మల్లేపల్లి శివారు జాతీయ రహదారి పక్కన పెట్రోల్ బంకు ఎదురుగా ఈ సుడిగాలి ఎగిసింది. కొద్దిదూరం దూసుకెళ్లిన సుడిగాలి, స్థానికుల గుండెల్ని కుదిపేసింది. సుడిగాలి తీవ్రతకు రహదారిపై ఆటోలు గాలిలో ఎగిరి కొట్టుకుపోయాయి.

**బంకు నుంచి పారిపోయిన జనం.. కొట్టుకుపోయిన వాహనాలు**

సుడిగాలి తమ వైపు వస్తోందని పెట్రోల్ బంకులోని ఉద్యోగులు పరుగులు తీశారు. ఇక అన్నవరం రైల్వే గేటు వద్ద సమీపంలోను సుడిగాలి బీభత్సం సృష్టించింది. సుడిగాలి దాటికి రైల్వే గేటు సమీపంలో ఆగిన వాహనాలు చెల్లా చెదురుగా ఎగిరిపడ్డాయి. సుడిగాలి దాటికి ఓ ఆటోతో పాటుగా, టాటా ఏస్ వాహనం ఎగిరిపడ్డాయి. దీంతో ఆటో లోని ఇద్దరు గాయపడ్డారు. మరో ప్రాంతంలో విద్యుత్తు తీగలు తెగి రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. భారీ వృక్షాలు నేల కూలాయి. రైల్వే గేట్ పక్కనే ఓ ఇంటి రేకులు సైతం సుడి గాలిలో కొట్టుకుపోయాయి. ఆ తర్వాత పంపా రిజర్వాయర్ వైపు కదలడంతో రిజర్వాయర్లోని నీరు టోర్నడోతో పాటుపైకివెళ్లింది. (మిగతా 2లో..)

## కుటీర పరిశ్రమలలో తయారయ్యే వస్తువులకు

# “మేడ్ ఇన్ ఆంధ్ర” బ్రాండ్

### కుటీర పరిశ్రమలకు వెన్ను దన్నుగా ఆల్ తెలుగు ప్రజా పార్టీ మేనిఫెస్టో...

### ATPP వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కటికల శివ భాగ్య రావు






విజయవాడ (ప్రజాపాలన ప్రతినిధి): ఆంధ్ర ఉత్పత్తులకు ఊతం ఇచ్చేలా కుటీర పరిశ్రమలను ప్రోత్సహించి “మేడ్ ఇన్ ఆంధ్ర బ్రాండ్” ను దేశవ్యాప్తం గా గుర్తింపును తీసుకురావడానికి ఆల్ తెలుగు ప్రజా పార్టీ కృషి చేస్తుందని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కటికల శివ భాగ్య రావు అన్నారు. బుధవారం ప్రజాపాలనతో ఆయన మాట్లాడుతూ ఆ పార్టీ అధికారంలోకి వస్తే యువతను ప్రోత్సహించి వారి ద్వారా చిన్న తరహా పరిశ్రమలు స్థాపింపజేసి రాష్ట్రంలో నిరుద్యోగం అనే మాట లేకుండా చేస్తామన్నారు. రాష్ట్రములో మొదలు పెట్టే స్టార్టప్ కంపెనీలకు ఆ యొక్క ప్రొడక్ట్స్ ని బట్టి గవర్నమెంట్ గ్రాంట్స్ లో ఒక లక్ష నుంచి 5 లక్షలు ప్రోత్సాహకంగా ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. నిరుద్యోగం రూపుమాపడానికి క్రొత్త క్రొత్త ప్రొడక్ట్స్ ఇవ్వడానికి ఈ గ్రాంట్స్ ఇవ్వటం జరుగుతుందని, గవర్నమెంట్ కాంట్రాక్ట్స్ ని ఇంజనీర్ కి ప్రిఫెట్స్ బేసిస్ మీద ఇస్తామన్నారు. విలేజ్ ఇండస్ట్రీస్, వాటి సర్వీసెస్ ను పెంపొందించడానికి ప్రభుత్వ పథకాలన్నింటినీ ఒక గొడుగు క్రిందకు తీసుకువచ్చి ప్రతి కుటుంబానికి అందించే విధానము, మేడ్ ఇన్ ఆంధ్ర ప్రొడక్ట్స్ ని అన్ని రంగాలలో తయారు చేయుడానికి మద్దతిచ్చి పరిశ్రమ రంగంలోనే గుణాత్మకమైనటువంటి మార్పు తీసుకొస్తామని ఆయన పేర్కొన్నారు. సింగిల్ క్యాబ్ ఓనర్స్ కి ప్రభుత్వపు టెండర్స్ లో కార్ల లీజు కొరకు పార్టిసిపెట్ చేసే విధంగా ఏర్పాటు చేయబడతాయని, పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం లో స్మాల్, మీడియం స్కేల్ ఇండస్ట్రీస్ కి పెద్దపీట వేస్తామన్నారు. కుమ్మరి, మంగలి , కంసాలి, మత్యకారులు, వడ్డెర, కల్లుగీత దారులు, పాల ఉత్పత్తి దారులు మొదలగు కులవృత్తులు చేసుకొనే వారి యొక్క అభివృద్ధికి 10 లక్షల రూపాయలు పావలా వడ్డీకే రుణాలు ఇస్తామన్నారు. నిరుద్యోగంను రూపుమాపుటకు కుటీర పరిశ్రమలను ప్రోత్సహించటానికి రాష్ట్రములో తయారు అయ్యే సబ్బులు, పౌడర్లు, షాంపూలు, ఉప్పు, అన్ని ప్రొడక్ట్స్ కి గవర్నమెంట్ ప్రొక్యూర్మెంట్ చేసే స్థానంలో మొదట రాష్ట్రములో తయారు అయ్యే ఉత్పత్తులను కొంటామని,ఇండస్ట్రియల్ సెక్టార్ లో ఉత్పత్తి నిర్మాణం, ప్రాసెసింగ్ ప్రొడక్ట్స్ వంటి వాటిని అభివృద్ధి చేసి,మేడ్ ఇన్ ఆంధ్రా ఉత్పత్తులను విదేశాలకు ఎక్స్ పోర్ట్ చేసే ప్రణాళికను ఆల్ తెలుగు ప్రజా పార్టీ అధికారంలోకి రాగానే అమలు పరుస్తామని ఆయన తెలియజేశారు.






## రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలి: నాయకర్



నరసాపురం, డిసెంబర్ 6 (ప్రజాపాలన ప్రతినిధి) : మిచౌంగ్ తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన నరసాపురం నియోజకవర్గంలోని లిఖితపూడి, మల్లవరం, మల్లవరం లంక, వేములదీవి తూర్పు, వేముల దీవి పడమర, బియ్యపుతిప్ప, పిఎం లంక గ్రామాలలో జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యులు, జనసేన- తెదేపా సమయ కమిటీ సభ్యులు, నరసాపురం నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ బొమ్మిడి నాయకర్ పార్టీ నాయకులతో కలిసి బుధవారం పర్యటించారు. నీట మునిగిన పంట చేలను, తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు పంటచేలు నీట మునిగి పంట నష్టపోయిన రైతులను, ఉపాధి కోల్పోయిన రైతు కూలీలను ఆయన కలిసి పరామర్శించారు. జనసేన పార్టీ వారికి అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. భారీ వర్షాల కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని తడిసిన ధాన్యాన్ని ఏ విధమైన ఆంక్షలు లేకుండా ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా నాయకర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకర్ వెంట పార్టీ నాయకులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, ఆకన చంద్రశేఖర్, కొల్లాటి గోపికృష్ణ, బందెల రవీంద్ర, వాతాడి కనకరాజు, నిప్పులేటి తారకరామారావు, తోట నాని, పోలిశెట్టి సాంబ, వట్టిప్రోలు సతీష్, గ్రంధి నాని, దేసినీడి గంగాధర్, వెన్నా నరేష్, చామకూరి రమేష్, పెద్ద సంఖ్యలో నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు పాల్గొన్నారు.

## రైతులు నష్టపోయారు అంటే దానికి వైసిపి పెద్దలు, ఎమ్మెల్యే కోన రఘుపతే ముమ్మాటికి కారణం



బాపట్ల జిల్లా ప్రజపాలన డిసెంబర్ 6వేగేశన నరేంద్ర వర్మబాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్జిల్లెళ్ళమూడి గ్రామం, నల్లమడవాగు తుఫాను కారణంగా ఉధృతంగా ప్రవహించడంతో లినరేంద్ర వర్మలి మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు తో కలసి పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. నల్లమడ వాగు గట్టు తెగి పంట పొలాల లోకి నీరు ప్రవహించటం తో రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు వాగు వద్ద వున్న మట్టిని అక్రమంగా త్రవ్వుకొని అమ్ముకోవడం వలన నేడు రైతులు అరుగాలం శ్రమించి పండించిన పంట రైతుకు నేడు అందని పరిస్థితి నెలకొన్నదని అన్నారు తుఫాను కారణంగా కొంతమేర పంట నష్టం జరిగితే వాగులు వద్ద ఉన్న మట్టి అమ్ముకోవడం వల్లనే పంటలు మునిగిపోతున్నాయన్నారువైసీపీ పెద్దలు సహకారంతో కోన రఘుపతి అండదండలతో అక్రమంగా మట్టిని తవ్వారని రైతులు వాపోయారన్నారు ఈరోజు రైతులు నష్టపోయారు అంటే దానికి కారణం వైసిపి పెద్దలు, ఎమ్మెల్యే కోన రఘుపతే ముమ్మాటికి కారణం అన్నారు డ్రైన్ కు వున్నా షట్టర్లు మరమ్మత్తులు చేయకపోవడం వలన పంట పొలంలోకి నీరు ప్రవహించి రైతులు తీవ్రంగా నష్టపోయారు వైసిపి ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటినుండి ఒక్క కాల్వకూడా మరమ్మతులు చేయలేదన్నారు అనంతరం ఆర్డీఓ తో ఫోన్ లో మాట్లాడి అక్కడ నెలకొన్న పరిస్థితి ని వివరించి వెంటనే స్పందించి వాగు తెగిపోకుండ చర్యలు చేపట్టి రైతులకు వున్న సమస్యను పరిష్కరించాలని అన్నారు రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు పెద్దపీట వేసి రైతుల సమస్యలన్నీ పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు ఈ కార్యక్రమంలో బాపట్ల మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, రైతులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సెంచురీ ప్యానల్ పరిశ్రమను పరిశీలించిన జిల్లా కలెక్టర్ విజయరామరాజు



బద్వేల్ ప్రజాపాలన ప్రతినిధి :బద్వేల్ నియోజకవర్గం గోపవరం సెంచురీ ప్యానల్ పరిశ్రమను పరిశీలించిన కడప జిల్లా కలెక్టర్ విజయరామరాజు బద్వేల్ ఆర్డిఓ ఆకుల వెంకటరమణ పరిశీలించారు బుధవారం నాడు బద్వేలు సమీపంలో ఉన్న గోపురం మండలం పి పి కుంట వద్ద నిర్మాణాంతరమైన పరిశ్రమను పరిశీలించి అక్కడ జరుగుతున్న పనులు గురించి ఆరాధించారు సెంచరీ ప్యానెల్ పరిశ్రమను కాంట్రాక్టర్ ను స్థానిక అధికారులతో కలిసి పరిశ్రమలో జరుగుతున్న నిర్మాణ పనులు పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు

# రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు ఘన నివాళి

### అయన స్ఫూర్తితో యువత ముందుకు నడవాలి: మున్సిపల్ కమిషనర్



గుడివాడ : రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 67వ వర్ధంతిని పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఘన నివాళులర్పించారు. బుధవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని అంబేద్కర్ భవన్‌లో ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పొంగులేటి జయరాజు అధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అంబేద్కర్ చూపిన మార్గంలో పయనించాలంటే విద్యను ఆయుధంగా చేసుకోవాలన్నారు. అంబేద్కర్ దేశంలో ప్రతి ఒక్కరికి నాయకుడేన సంగతి గుర్తు పెట్టుకోవలన్నారు. ఆయన బోధించు, పోరాడు, సమీకరించు అనే నినాదంతో అంబేద్కర్ ముందుకు వెళ్ళారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీలం ప్రభాకార్, దారం కరణాకార్, కంచర్ల సుధకార్, బొడ్డు విల్సన్‌బాబు, కోటి, సాలే నవీన్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో...

స్థానిక టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నేటి ప్రభుత్వం ఎస్సీలను పూర్తిగా విస్మరించి 27 సంక్షేమ పథకాలను రద్దు చేయడం దారుణమన్నారు. ఎస్సి, ఎస్టీ. హక్కుల కోసం మళ్ళీ పోరాటాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమములో సర్పంచ్ కాకరాల సురేష్, నియోజకవర్గ తెలుగుయువత ధ్యక్షుడు గోవాడ శివా, పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, మహిళా అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి, నాయకులు వసంతవాడ దుర్గారావు, అడుసుమిల్లి శ్రీనివాసరావు, పోలాసి ఉమా, జానీషరీఫ్, కంచర్ల సుధకార్, దాసు శ్యామ్‌ప్రసాద్, కనకబరం, మార్క్‌రాజు, జబీన్, రామదేణ్ వేణ్, రెడ్డి షణ్మకం, రజనీకాంత్, కొడాలి బాలు, పెద్ది వీరబద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సిపి ఆధ్వర్యంలో...

స్థానిక శరత్ థియేటర్‌లో వైఎస్ఆర్ ఎస్.సి సెల్ జిల్లా కార్యదర్శి వెంపటి సైమన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ 67వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోకితల అంజనేయప్రసాద్, మామిళ ఏలిశా, షేక్ బాజీ, రేమల్లి నీలాకాంత్(పసి), చూదూరి శేఖర్, ప్రశాంత్, ఉమా, అత్తాటి సాల్మన్, యార్లగడ్డ గోవర్ధన్,త తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో...

స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు కంచర్ల సుధాకర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు వెంపటి సైమన్, వసంతవాడ దుర్గురావు, పంచకర్ల వెంకట్, యార్లగడ్డ గోవర్ధనరావు, నాయకులు మామిళ్ళ ఏలిషా, అత్తాటి సాల్మన్, గంధం సైమన్‌బాబు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

వెనిగండ్లలో అధ్వర్యంలో ...

స్థానిక బైపాస్‌రోడ్డులోని టిడిపి ఇన్‌చార్జి వెనిగండ్ల రాము అధ్వర్యంలో అంబేడ్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఐఏఎఫ్ఎస్ కకోల్లు బస్మకరరావు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, గడ్డం ప్రకాష్ దాస్ , మెరుగు మోజేష్, కాటూరు ఏసుపాదం, గూడపాటి రాజేష్, కొదముల గంగాధర్, మజ్జి శ్రీనివాసరావు, శాయన రాజేష్, జేమ్స్, బుడమ రాజు, వెంకట్, రామశాస్త్రి, సాంబశివరావు, ప్రభాకర్‌రెడ్డి, గుత్తా చంటి, షేక్ ఇబ్రహీం, సిరిపురపు తులసిరాణి, మల్లికా బేగం, జయశ్రీ, తదితరులు, పాల్గొన్నారు.

బిజెపి అధ్వర్యంలో ...

స్థానిక బిజెపి కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు యర్రబోతు అర్జున్ అధ్వర్యంలో అంబేడ్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్, రాంప్రసాద్, మాదాసు సత్యనారాయణ, కొత్త కిరణ్, పరుచూరి మురళీ, ఎస్.శేషఛారి, జి,రాము, ఎన్.నాగఛారి, తదితరులు పాల్గొన్నారు.

హిందూ, క్రిస్టియన్ మాలల పరిరక్షణ సమైఖ్య సంఘం కార్యాలయంలో..

స్థానిక కోతిబోమ్మ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద హిందూ మాల, క్రిస్టియన్ మాలల పరిరక్షణ సంఘ రాష్ట్ర అధ్యక్షులు కర్రా గాబ్రియేలు ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోరం రాజు, బూపతి నాగేశ్వరరావు, వర్రే నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలి

**బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల**



గుడివాడ : గుడివాడ రూరల్ మండలంలోని వలివర్తిపాడు గ్రామ పరిధిలోని దొండపాడురోడ్డు లోని తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటను బిజెపి జిల్లా పధాన కార్యదర్శి అంగడాల సతీష్, నాయకులు సూరే గాంధీ, రూరల్ మండలం అధ్యక్షులు శీలం శంకర్రావులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోని ఎకరానికి కనీసం 20 వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలన్నారు. తడిసిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# టోర్నడో బీభత్సం.. మిచాంగ్ తుది విన్యాసం

(మొదటి పేజీ తరువాయి)

**రాజమహేంద్రవరంలో భయానకం..**

జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో సుడిగుండం భయానక వాతావరణాన్ని సృష్టించింది.. వై-జంక్షన్, వీ ఎల్ పురం, మోరంపూడి, హుకుంపేట, ప్రకాశంనగర్, దానవాయిపేట, ఆర్ట్స్ కళాశాల పరిసరాలు, వై.జంక్షన్ తదితర చుట్టుపక్కల ప్రాంతాల్లో టోర్నడోలు కలవరం సృష్టించాయి. భారీ సుడిగాలితో ఇళ్లు , దుకాణాలపై పైరేకులు గాల్లోకి ఎగిరి కిందపడ్డాయి. గాలి వేగానికి దుకాణాల్లో వస్తువులు బయటకు ఎగిరిపడ్డాయి. గోదావరి నదిలో సముద్ర అలలు మాదిరి ఎగిసిపడ్డాయి. జనం ప్రాణభయంతో సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. వీరభద్రపురంలో కంటిపూడి రామారావు మున్సిపల్ పాఠశాలలో నాడు-నేడు పనుల్లో భాగంగా రెండవ అంతస్తు పైన వేసిన రేకుల షెడ్డు కింద పడింది.

**వాయువేగం.. సుడులు సుడులుగా గాలి..**

పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరంలో. జాతీయ రహదారి 165 కు సమీపంలో వరి పొలాలలో ప్రారంభమైన సుడిగుండంవాయువేగంతో సుడులు తిరుగుతూ సుమారు రెండున్నర కిలోమీటర్లు బీభత్సం సృష్టించింది. వీరవాసరం, వడ్డిగూడెం, తోలేరు గ్రామాలలో భీభత్సం సృష్టించింది. ఈ టోర్నడో దెబ్బకు భారీ చెట్లు, చెరువుల లోని నీరు, మూడు ట్రాక్టర్లు, వరి కోత మిషన్, లారీ పైకిఎగిరి పడ్డాయి. జాతీయ రహదారి పక్కనే ఉన్న ఒక కక్కా- ముక్కా రెస్టారెంట్, ఒక రైస్ మిల్లు ధ్వంసమయ్యాయి. కొత్తగా ఏర్పాటు చేసిన కక్కా- ముక్కా రెస్టారెంట్ పైన రేకులు ఫర్నీచర్, వంట సామాగ్రి ధ్వంసం అయ్యాయి. వందలాది చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సుడిగాలి బీభత్యానికి వీరవాసరం మండలం తోలేరులో తాటాకిళ్లు కూలడంతో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి.వారిని భీమవరం లో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చెరువు గట్టున ఏర్పాటు చేసిన విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్ ఎగిరి చెరువులో పడింది.

# ఆదర్శనీయుడు అంబేద్కర్

**ఆంధ్రాలో రాజారెడ్డి రాజ్యాంగం అమలవుతుంది జ్యోతుల నెహ్రూ**



గోకవరం ప్రజా పాలన డిసెంబర్ 6 తూర్పుగోదావరి జిల్లా గోకవరం డిసెంబర్ 6:అంబేద్కర్ ఆదర్శనీయుడని ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా గోకవరం దేవి చౌక్ సెంట్రల్ లో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈసందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం బదులు ఆంధ్ర రాష్ట్రంలో గత నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలలు కాలంగా రాజారెడ్డి రాజ్యాంగం అమలవుతుందని దళితులపై దాడులు, దళిత మహిళపై అత్యాచారాలు, ప్రజా ప్రతినిధులే దళితులను హత్య చేయడం, పోలీస్ స్టేషన్ లోనే దళితుల శిరోమండలం వంటి కార్యక్రమాలతో అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఆంధ్రప్రదేశ్ లో అమలుకు నోచుకోవడం లేదని ఇది దేశ చరిత్రలోనే అన్యాయమని అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ప్రతి పౌరుడికి అమలయ్యేలా అందరూ కృషి చేయాలని అన్నారు.మన రాజ్యాంగం ప్రపంచ దేశాలకు తలమానికంగా, ఉన్నాయని మళ్లీ అందరూ సుభిక్షంగా ఉండాలంటే అంబేద్కర్ రాజ్యాంగం అమలు అవ్వాలంటే టిడిపి రావాలని ఆయన అన్నారు అన్నారు.ఈ కార్యక్రమంలో ఈది అశోక్, గునిపే భరత్, పాలూరి బోసు బాబు, మంగ రౌతు రామకృష్ణ, ఉంగరాల గణేష్, గుండా శివప్రసాద్, పోసిన ప్రసాద్, సాలపు నలమహారాజు, మండిగ గంగాధర్,జి.లాజర్, యేసు, జయరాజు, పాపారావు, ఆనంద్, గోపి, సిరిబాబు, అచ్చన్నదొర, బాబు, సత్తి రాజు, ద్వారపూడి శ్రీను, పాలాడి శ్రీను,

## 2024-25 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలు 14లోగా సమర్పించాలి..

(మొదటి పేజీ తరువాయి)

వీటితోపాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి పారిశ్రామికీకరణ లక్ష్యాలను సాధించేలా మూలధన వ్యయ ప్రతిపాదనలు పంపాల్సిందిగా సూచించారు. ఈ ప్రతిపాదనలు తప్పనిసరిగా మిషన్ లక్ష్యాల ఆధారంగా ఉండాలని స్పష్టం చేశారు. మంజూరు చేసిన పనుల వివరాలపైనే బడ్జెట్ ప్రతిపాదనలు చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయని పనుల కోసం ఎటువంటి బడ్జెట్ ప్రతిపాదనలు చేయరాదని సూచించారు. అలాంటి పనులకు బిల్లులను కూడా అంగీకరించబోమని పేర్కొన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లేని పనుల ప్రతిపాదనలను కూడా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయరాదన్నారు. అందుబాటులో ఉన్న ఆర్థిక వనరుల సమర్థ వినియోగం ద్వారా ఫలితాలు సాధించేలా బడ్జెట్ ప్రతిపాదనలు ఉండాలని సూచించారు. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత పథకాలను సమీక్షించి.. ఆ పథకాలకు చేస్తున్న వ్యయం మేరకు ఫలితాలు, ప్రయోజనాలు పరిశీలించాలని జీవోలో పేర్కొన్నారు. ప్రయోజనం లేని పథకాలను ఆర్థిక శాఖతో సంప్రదించి నిలిపివేయాలన్నారు. ఇలా ఆదా అయిన సొమ్ముతో కొత్త పథకాలను రూపొందించాలన్నారు.అన్ని శాఖాధిపతుల వేతనాలేతర వస్తువులు, ఇతర వ్యయాలను సమీక్షించి 20 శాతం మేర పొదుపును ప్రతిపాదించాలని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఉప ప్రణాళికలకు ప్రత్యేక ప్రతిపాదనలు సమర్పించాలని, ప్రస్తుత ప్రతిపాదనలను సమీక్షించి, మార్పులు అవసరం ఉంటే చేయాలన్నారు. అన్ని శాఖలు వాస్తవికంగా అంచనాలు వేసి బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. తప్పనిసరి వ్యయాలైన సబ్సిడీలు, సామాజిక భద్రత పెన్షన్లు మొదలైన వాటికి లబ్ధిదారుల సంఖ్య ఆధారంగా తగిన నిధులను ప్రతిపాదించాలి. కన్సల్టెంట్స్, ఔట్‌సోర్సింగ్, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులకు కొత్తగా ఎలాంటి ప్రతిపాదనలు చేయకూడదన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని అంచనాలను అత్యంత జాగ్రత్తతో రూపొందించాలనీ పేర్కొన్నారు. అంచనాలు, వాస్తవాల మధ్య భారీ వ్యత్యాసాలనునివారించాలన్నారు. ప్రస్తుత పన్ను రేట్లు ఆధారంగానే రెవెన్యూ రాబడుల అంచనాలను ప్రతిపాదించాలన్నారు.వీలైనంత మేర ఆదాయ వనరుల ఆర్జనపై శాఖలు దృష్టి పెట్టాలన్నారు.

## తుఫాన్ కు తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు అన్నదాతకు భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే చంటిబాబు



గోకవరం ప్రజా పాలన డిసెంబర్ 6.: మండలంలోనీ ముంపుకు గురైన పంట ను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతులు చంటిబాబు బుధవారం స్వయంగా పరిశీలించారు. మండలములోని గోకవరం, కృష్ణుని పాలెం, తంటికొండ, గుమ్మల దొడ్డి గ్రామాల్లో పర్యటించి ఇటీవల కురిసిన వర్షాలు వల్ల నష్టపోయిన పంట ను స్వయంగా ఎమ్మెల్యే చంటిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్ళాల్లో తడిచిన ధాన్యాన్ని కోసం రైతన్నలు అధైర్యపడవద్దని తడిసిన రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నదాతలకు ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక తాసిల్దార్ తో మాట్లాడుతూ రైతులు పంట నష్టం వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఎమ్మెల్యే సూచించారు.తడిచిన రంగు మారిన ధాన్యాన్ని వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే కొనుగోలు చేయాలని రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా అధికారులు సక్రమమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే చంటిబాబు అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు జడ్పిటిసి దాసరి శ్రీరంగ రమేష్. వరసాల ప్రసాద్, కర్రి శివరామకృష్ణ నందూరి బుజ్జి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్ కుమార్. తాసిల్దార్ ఎ. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## ముంపు ప్రాంతాలలో తెదేపా, జనసేన నేతల పర్యటన



ఉండి, డిసెంబర్ 6 (ప్రజాపాలన ప్రతినిధి): మిచాంగ్ తుఫాను కారణంగా గత 3 రోజులుగా కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన ఉండి నియోజకవర్గం ఆకివీడు నగర పంచాయతీలోని 20 వ వార్డులో శాసన సభ్యులు మంతెన రామరాజు, ఉండి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ జుత్తుగ నాగరాజులు పార్టీ నేతలతో కలిసి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా మంతెన రా, జుత్తిగ నాగరాజులు నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించి ప్రజలు ఎదురుకుంటున్న ఇబ్బంధులను తెలుసుకున్నారు. బాధితులకు తెలుగుదేశం, జనసేన పార్టీల తరపున అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ముంపుకు గురై నష్టపోయిన బాధిత కుటుంబాలకు తగిన ఆర్థిక సహాయం అందించేలా చర్యలు చేపట్టాలని నగర పంచాయతీ కమిషనరును ఎమ్మెల్యే మంతెన రామరాజు ఆదేశించారు. బాధితులను తక్షణమే ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీల పట్టణ అధ్యక్షులు, కార్యవర్గ కమిటీ సభ్యులు, ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మునిగిన పంటచేలను పరిశీలించిన కొత్తపల్లి



నరసాపురం, డిసెంబర్ 6 (ప్రజాపాలన ప్రతినిధి) : మిచాంగ్ తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన నరసాపురం మండలం యర్రంశెట్టివారి పాలెం గ్రామంలోని పంట పొలాలను మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు బుధవారం పరిశీలించారు. నీట మునిగిన వరిచేలను, వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. పంట నష్టాలను రైతుల నుండి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వరిచేలు నీట మునిగి పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఏ విధమైన ఆంక్షలు లేకుండా తడిసిన ధాన్యాన్ని రైతుల నుండి ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ యర్రంశెట్టి త్రినాధ వెంకట నరసింహా రావు (బాబులు), గ్రామ ఉపసర్పంచ్ తెలగంశెట్టి శ్రీదేవి వాసు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 67 వ వర్ధంతి



కారంపూడి... డిసెంబర్06.. .ప్రజాపాలన... ప్రతినిధి :పట్టణంలోని ఇందిరా గాంధీ బొమ్మ సెంటర్లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద వర్ధంతి సందర్భంగా కారంపూడి మండల తెలుగుదేశం జనసెన పార్టీ ల నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సంధర్బంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల లు వేసి నివాళి అర్పించారు.వృద్ధులకు వికలాంగులకు పాలు,పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జన సేన సమన్వయ కర్త బూసా రామాంజనేయులు మాట్లాడుతూ బీ అర్ అంబేద్కర్ ఆశయాలు సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి అని కోరారు.అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం అని కొనియాడారు.జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి గోల్ల సురేష్ యాదవ్ మాట్లాడుతూ అంబేద్కర్ గారి రాజ్యాంగ పలితంగా ఎంతో మంది బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగింది అని అన్నారు.రాష్ట్రంలో రాజా రెడ్డి రాజ్యాంగం అమలు లో ఉందని అంబేద్కర్ రాజ్యాంగం అమలు కోసం టీడీపీ జనాసెన పోరాటం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మాచర్ల నియోజకవర్గం భూసా రామాంజనేయులు. కారంపూడి జనసేన మండల అధ్యక్షుడు కేసనపల్లి కృష్ణ బాబు. %oఎని%.నాయుడు... కారంపూడి టిడిపి సీనియర్ నాయకులు చెప్పిడి రాము టిడిపి పట్టణ అధ్యక్షులు కటికళ.బాలకృష్ణ. తాండ మస్తాన్ తాండా జానీ. భాషా. బాలు నాయక్. గ్రామ జనసేన నాయకులు జనార్ధన్ షేక్ సైదా బోజ్జయ్య.మరియు టిడిపి కార్యకర్తలు జనసేన కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబేద్కర్ కు నాయకర్ నివాళులు.



నరసాపురం, డిసెంబర్ 6 (ప్రజాపాలన ప్రతినిధి) :భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్థానిక నియోజక వర్గ జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ చైర్మన్, రాష్ట్ర తెదేపా- జనసేన సమన్వయ కమిటీ సభ్యులు, జనసేన పార్టీ పీఏసీ సభ్యులు, నరసాపురం నియోజకవర్గ ఇన్చార్జి బొమ్మిడి నాయకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అణగారిన వర్గాల కోసం పాటుపడిన బాబా సాహెబ్ అంబేద్కర్ సేవలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణ అవకాశం అదృష్టంగా భావిస్తున్నా

**చీరాల శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి**



చీరాల, డిసెంబర్ 06, ప్రజాపాలన : రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని, ఆవిష్కరించే అవకాశం లభించటం అదృష్టంగా భావిస్తున్నానని, చీరాల నియోజకవర్గ శాసనసభ్యులు కరణంబలరామకృష్ణమూర్తి ఆనందం వ్యక్తంచేశారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్క ర్ 67వ వర్ధంతి సందర్భంగా, చీరాల మున్సిపల్ పరిధిలోని, స్టేషన్ రోడ్లో గల అంబేద్కర్ భవన్ ఆవరణలో, నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, విగ్రహావిష్కరణకార్యక్రమంలో ఎమ్మెల్యే బలరామ్ పాల్గొని,డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.అంబే ద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందించిన సేవలను ప్రశంసిస్తూ, అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి తో పాటు, ఎమ్మెల్సీ పోతుల సునీత, పట్టణ అధ్యక్షులు కోండ్రు బాబ్జీ, గుంటూరు మాధవరావు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, వేట పాలెం మండల అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, కౌన్సిలర్స్ కీర్తి వెంకట్రావు, బత్తుల అనీల్, కంపా అరుణ్, గుంటూరు ప్రభాకరరావు, తోకలఅనిల్, చీమకుర్తి బాలకృష్ణ, పొత్తూరి సుబ్బయ్య, ఇంచార్జ్లు మల్లి రామకృష్ణ, కోలా శివకృష్ణ, రాజశేఖర్, జిల్లా కార్యదర్శి శిఖా సురేష్, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు సల్లూరి అనీల్, వాసిమళ్ళ బ్రదర్స్, దుడ్డు సైమన్, డి.ఇ ఏసయ్య ,శానిటరీ ఇన్స్పెక్టర్ డొక్కా కొండయ్య, చీరాల, వేటపాలెం మండలాల నాయకులు,ప్రజా సంఘాల నాయకులు, అంబేద్కర్ అభిమానులు తది తరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## అధైర్యపడవద్దు.., ప్రభుత్వం అండగా ఉంటుంది: తహసీల్దార్ జి.ప్రభాకరరావు



చీరాల, డిసెంబర్ 06, ప్రజాపాలన : అధైర్యపడవద్దు.., నష్టపోయిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని, రైతులకు తహసీల్దార్ జీవి గుంట ప్రభాకరరావు భరోసా కల్పించారు. చీరాల మండల పరిధిలోని విజయలక్ష్మీ పురం, కావూరివారిపాలెం, బుర్ల వారిపాలెం, పిట్టువారి పాలెం, తదితర మండల వ్యాప్తంగా ఉన్న ఆయా పంచాయతీ ల పరిధిలలో, తుఫాను కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. పంట పొలాల్లో నిలిచిన నీటిని తొలగించే ప్రక్రియను పర్యవేక్షించారు. ఎవరు ఏ ఏ పంట నష్టపోయారో, ఎంత నష్టపోయారో తదితర సమగ్ర వివరాలతో, కూడిన నివేదికలను అందజేయాలని వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు. నిష్పక్షపాతంగా పంట నష్టాన్ని అంచనా వేయాల ని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ, వ్యవసాయశాఖ, పంచాయతీ, సచివాలయ అధికారులు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# నిరక్షరాస్యత లేని భారతదేశనిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములుకావాలి

**శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ యం.డి.డా.తాడివలస దేవరాజు**



చీరాల, డిసెంబర్ 06, ప్రజాపాలన : డాక్టర్ అంబేద్కర్ స్ఫూర్తి తో ఉన్నత చదువులు చదివి, సమాజంలో ప్రతి ఒక్కరు చదువు కోడానికి, ఒకరికి ఒకరు సహకరించాలని, నిరక్షరాస్యత లేని భారత దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తాడివలస దేవరాజు పిలుపునిచ్చారు.రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా, పేరాల, చీరాల అంబేద్కర్ భవన్ లలోని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకి, డాక్టర్ తాడివలస దేవరాజు పూలమాలలు వేసి ఘనంగా నివా ళులు అర్పించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందించిన సేవలను గుర్తుచేస్తూ, ఆయన అడుగుజాడల్లో నడుస్తామని శపథం చేశారు. కార్యక్ర మంలో డాక్టర్ తాడివలస దేవరాజు తో పాటు, పంబా నరేష్, సూర్య నారాయణ, గుద్దంటి శ్రీకాంత్, డేటా సూర్య, ఖాజా తదితరులు పాల్గొ న్నారు.

# మిచౌంగ్ తుఫాన్ వల్ల పంట నష్టం



కారంపూడి... డిసెంబర్06...ప్రజాపాలన... ప్రతినిధి :అకాల వర్షాల వలన రాష్ట్ర వ్యాప్తంగా నష్టపోయిన రైతాంగానికి వెంటనే నష్ట పరిహారం అందించాలి అని టీడీపీ జనసెన నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం మండలం లోని ఒప్పిచర్ల గ్రామంలో పంట పొలాలను సందర్శించి పంట నష్టపోయిన రైతాంగాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్బంగా జనసెన నియోజకవర్గ సమన్వయ కర్త బూస రామాంజనేయులు మాట్లాడుతూ వర్షాల వలన రైతాంగం తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులకు ప్రతి ఎకరాకు 20 వేలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి గోల్ల సురేష్ యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో హూద్ హూద్,తిత్లీ లాంటి తుఫాన్ లు వచ్చినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా అక్కడకు వెళ్లి అధికారులను,ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ప్రాణ నష్టం జరగకుండా చేశారు అని అన్నారు.ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్ ఇంట్లో కూర్చుని ప్రజలను గాలికి వదిలేశారు అని విమర్శించారు.మండల జనసే న అధ్యక్షులు కేసానుపల్లి కృష్ణబాబు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి అధికారులను క్షేత్రస్థాయి పరిశీలన కు పంపి నష్ట పరిహారం అందించాలి అని కోరారు.పంటలకు నష్ట పరిహారం అందే వరకు చంద్రబాబునాయుడు,పవన్ కళ్యాణ్ గార్ల నాయకత్వ లో రెండు పార్టీల నాయకులు కార్యకర్తలు పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు చప్పిడి రాము పట్న టిడిపి అధ్యక్షులు. కటికల బాలకృష్ణ తండా మస్తాన్ జానీ భాష లాలూ నాయక్. జనసేన కార్యకర్తలు జనర్ధన్ ఎస్కే సైదా బోజ్జయ్య లక్ష్మయ్య. వరి పంట నష్టపోయిన రైతులు హరిబాబు పంగులూరి రామకృష్ణ సత్యనారాయణ. ఆముదాలపల్లి కృష్ణ. చిన్న అప్పారావు. పెద్ద అబ్బాయి.. కోటేశ్వరరావు అంజి. సుబ్బారావు . శ్రీను. తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్



ప్రజాపాలన,గుడ్లవల్లేరు. మండల కేంద్రమయిన గుడ్లవల్లేరు సెంటర్ నందు డా.. బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని దళిత నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వార పాపారావు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సమాజంలో వర్ణ విభేదాలను రూపుమాపడానికి ప్రయత్నించిన మహనీయుడు అని , బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన కృషి మరవలేనిదని ఆయన కొనియాడారు.అలాగే అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వార పాపారావు,పిడుగు దైవసహాయం,దారం నిరంజనరావు, గురజ సాంభశివరావు తదితరులు పాల్గొన్నారు.

## వర్షానికి దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య



వత్సవాయి డిసెంబర్ 6 ప్రజా పాలన ప్రతినిధి మం డల పరిధిలోని ఆల్లూరుపాడు గ్రామంలో గ్రామ తెదే పా నాయకులతో కలిసి తుఫాను వలన దెబ్బతిన్న పంట పొలాలను మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు పూర్తి నష్టపరిహారాన్ని ప్రభుత్వం ద్వారా అందించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారుఈ కార్యక్రమం లో రాష్ట్ర తె లుగు రైతు అధికార ప్రతినిధి కొథారు స త్యనారాయణ ప్రసాద్, వత్సవాయి మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, మాజీ సర్పంచ్ కొమ్మినేని శ్రీనివాసరావు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆవుల శ్రీనివాసరావు, మల్లాది గోపి, చెన్న బాలకృష్ణ, మేకల రామచంద్రరావు, కాకాని బాల కృష్ణ, గొర్రె ముచ్చు శ్రీను, కంచర్ల తిరుపతిరావు తదిత రులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ వర్ధంతి వేడుకలు



నందిగామ డిసెంబర్ 6 ప్రజాపాలన ప్రతినిధి:రాజ్యాం గ నిర్మాత బహుజనవాది డాక్టర్ బి.ఆర్ అంబే ద్కర్ 67వ వర్ధంతి వేడుకలు వాడవాడలా దేశం మొత్తం ఘనంగా నిర్వహిస్తున్నారు అదే క్రమంలో పట్టణం లో ని ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు విశ్రాంత ఉద్యోగులు ఆధ్వ ర్యంలో రైతు పేటలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు ఘ నంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా అం బేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా అంజలి ఘటించారు ఈ కార్యక్రమం విశ్రాంత ఉపా ధ్యాయులు పిల్లి జయరాజు ఆధ్వర్యంలో నిర్వహిం చారు ఈ కార్యక్రమంలో బి ఎస్పి రాష్ట్ర ప్రధాన కార్య దర్శి బి పుష్పరాజు డివై దా సు ఉపాధ్యాయులు పా రా సురేష్, కటారు రమేష్ ఉ పాధ్యాయ సంఘాలు తదితరులు పాల్గొన్నారు

## నీట మునిగిన ఇళ్లను పరిశీలించిన పొత్తూరి



నరసాపురం, డిసెంబర్ 6 (ప్రజాపాలన ప్రతినిధి) : మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో గత మూడు రోజులపాటు కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన లోతట్టు ప్రాంతమైన స్థానిక ఒకటవ వార్డు శ్రీహరిపేటలో నరసాపురం నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు బుధ వారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అకాల వర్షాలకు నీట మునిగిన ఇళ్లను పరిశీలించి బాధితులను పరామర్శించారు. బాధితులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. తుపాను కారణంగా ఇళ్లు నీటమునిగి నష్టపోయిన పేద కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని జరిగిన నష్టాన్ని అంచనావేసి వారికి నష్టపరిహారం చెల్లించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు జక్కం శ్రీమన్నారాయణ 22 వ బూత్ కన్వీనర్ బోరా చిన్నాయమ్మ, నాగిడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి



భీమవరం, డిసెంబర్ 6 (ప్రజాపాలన ప్రతినిధి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 67 వ వర్ధంతిని బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరు ఆచరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, జడ్పిటిసి కాండ్రేగుల నరసింహారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, గంటా సుందర్ కుమార్, చిగురుపాటి సందీప్, పాలపర్తి జోనా, మానుకొండ ప్రదీప్, భలే ఏసుబాబు, కోడె యుగంధర్, చెల్లబోయిన సూర్యప్రకాష్, కోమటి రాంబాబు, రేవూరి గోగిరాజు, పేరిచర్ల సత్యనారాయణ రాజు,ఏ.ఎస్ రాజు, గాదిరాజు సుబ్రహ్మణ్య రాజు, అల్లూరి రాజేష్, కరిముల్లా భాషా తదితరులు పాల్గొన్నారు.

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

సంపాదకీయం

గురువారం 07, డిసెంబరు 2023

# భారత రాజ్యాంగం-బాబ్రీ మసీదు బాబా -సాహెబ్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి లౌకిక విలువలు, సమానత్వం అన్నవి నచ్చని అంశాలు. అందుకనే పార్లమెంట్ నూతన భవనం ప్రారంభంలో సభ్యులకు ఇచ్చిన రాజ్యాంగ పుస్తకాల ప్రవేశికలో సెక్యులర్, సోషలిస్టు అన్న పదాలను తొలగించారు. ఎమర్జెన్సీలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆ పదాలను చేర్చారు కనుక ఆ పదాలను తాము తొలగించినట్లు వివరణ ఇచ్చారు. కాని వాస్తవం ఏమిటంటే ఆచరణలో రాజ్యాంగ మూల స్వభావాన్నే బిజెపి మార్చాలనుకొంటోంది. ప్రభుత్వాన్ని మతంతో కలగాపులగం చేస్తోంది. మత సామరస్యం కోసం ప్రాణాలివ్వడానికి సిద్ధపడిన మహాత్మా గాంధీని చంపిన గాడ్సేని అనధికారికంగా ఆకాశానికి ఎత్తుతోంది. గాంధీజీ హత్య కేసులో సరైన సాక్ష్యాలు లేక బయటపడిన సావర్కర్ విగ్రహాన్ని పార్లమెంట్‌లో ప్రతిష్టించింది. కాకతాళీయమో! కాదో! కానీ భారతరత్న బాబాసాహెబ్ డా॥ బి. ఆర్. అంబేద్కర్ వర్ధంతి రోజే (డిసెంబర్ 6) కాషాయ పరివారం బాబ్రీ మసీదును కూల్చింది. భారత రాజ్యాంగమన్నా, చర్చి, మసీదులన్నా వారికి చెప్పలేనంత కడుపు మంట. దేశ పౌరుల్లో పర మత ద్వేషభావాన్ని పెంచి అధికారంలోకి రావడం కోసం వారు బాబ్రీ మసీదును లక్ష్యం చేసుకొన్నారు. ఇప్పుడు లౌకికతత్వం, రాజకీయ ప్రజాస్వామ్యం ప్రబోధించే భారత రాజ్యాంగాన్ని దాని విలువలను నీరుగార్చే పనిలో ఉన్నారు. సమానత్వం, సౌభ్రాతృత్వం, పౌరులందరికీ వర్తించే చట్టం, ప్రజలందరికీ జీవించే హక్కు, భావప్రకటనా స్వేచ్ఛ వంటి విలువలకు పాడె కడ్తున్నారు. భారత రాజ్యాంగం మతంతో నిమిత్తం లేకుండా దేశంలోని పౌరులందరికీ సమాన హోదా కల్పించింది. హిందూ మహాసభ, ఆర్‌ఎస్‌ఎస్‌లు కోరుకొన్నదే బిజెపి కూడా కోరుకొంటున్నది. భారతదేశం హిందువులదని, ఈ దేశంలో క్రైస్తవులు, ముస్లింలు తమ నివాసాన్ని కొనసాగించాలనుకొంటే రెండవ తరగతి పౌరుల్లా, హిందువులకు లోబడి బతకాలని ఆ సంస్థల సిద్ధాంతం. వినాయక్ దామోదర్ సావర్కర్, మహదేవ్ సదాశివరావ్ గోల్వాల్కర్ చాలా స్పష్టంగానే తమ రాతల్లో ఈ సిద్ధాంతాన్ని ప్రవచించారు. కాని భారత రాజ్యాంగం ఆ వాదనను పట్టించుకోలేదు. పౌరులందరికీ ఒకే విలువగల ఓటు హక్కునిచ్చింది. కుల మతాలతో నిమిత్తం లేకుండా మహిళలతో సహా భారత పౌరులందరికీ ఒకే రీతిగా చట్టాలు అమలవుతాయి. వారసత్వ చట్టాల్లో మాత్రం కొన్ని తేడాలున్నాయి. భారతీయులందరూ ఒక జాతి కాదంటూ రెండు జాతుల సిద్ధాంతాన్ని మొట్టమొదట ప్రతిపాదించింది సావర్కర్. బ్రిటిష్ ప్రభుత్వానికి క్షమాభిక్ష దరఖాస్తు పెట్టుకొని అండమాన్ జైలు నుండి విడుదలయిన సావర్కర్ బ్రిటిష్ పాలకులకు ఇచ్చిన మాట ప్రకారం స్వతంత్ర పోరాటం నుండి దూరంగా ఉన్నారు. హిందూ మహాసభకు అధ్యక్షుడయ్యాడు. భారత దేశంలో హిందూ, ముస్లిం రెండు జాతులున్నాయని సిద్ధాంతీకరించారు. ముస్లిం లీగ్ అధ్యక్షుడు మహ్మదాలీ జిన్నా ఆ తర్వాత అదే వాదనను అందుకొన్నారు. ఫలితం భారతదేశ విభజన. 'విభజించు పాలించు' విధానాన్ని వర్తింపచేసిన బ్రిటిష్ వలస పాలకులకు కావాల్సింది అదే కాగా ఆర్‌ఎస్‌ఎస్, దాని పరివారం విభజన పాపాన్ని మొదట మహాత్మా గాంధీ నెత్తికి చుట్టింది. ఇప్పుడు నెహ్రూ నెత్తికి చుడుతున్నారు. మహాత్ముడిపై గౌరవం ఒలకబోస్తూనే స్వాతంత్ర్యోద్యమంలోకి విశాల ప్రజానీకాన్ని సమీకరించిన ఆయన కృషిపై దుప్పటి కప్పి ఆయనను 'స్వచ్ఛత'కు పరిమితం చేశారు. పనిలో పనిగా 'స్వచ్ఛ భారత్' పేర 0.5 శాతం పన్నును జిఎస్‌టికి చేర్చారు. రాజ్యాంగ రచనా సంఘానికి అంబేద్కర్ అధ్యక్షుడే అయినా, అనేక రకాలైన సాంప్రదాయ వాదులతో కూడింది మన రాజ్యాంగ సభ. ఆ సభలో కొందరు పెద్దలకు హిందూ మహాసభకు ఉండే ఛాందస, ఒంటెత్తు భావనలు ఉన్నాయి. అయినప్పటికీ స్వాతంత్రోద్యమం నాటి విలువలపై ఆధారపడి భారత రాజ్యాంగ నిర్మాణం జరిగింది. కాని భారత రాజ్యాంగం మనది కాదు. మువ్వన్నెల జెండా మనది కాదు. భారత రాజ్యాంగం ఒక అతుకుల బొంత. పశ్చిమ దేశాల నుండి అక్కడ కొంత ఇక్కడ కొంత తెచ్చి జోడించారు. అది భారత్‌కు పనికి రాదు%ౌ%అంటూ కాషాయ దళాలు ఈసడిస్తుంటాయి. మువ్వన్నెల జెండా కూడా పశ్చిమ దేశాల తరహాలో ఉంది. మన జెండా కాషాయ రంగులో మధ్యలో ఒక చీలికతో ఉండాలని వాదిస్తుంటారు. చిత్‌పావన్ బ్రాహ్మణులైన పీష్వా పాలకుల కాషాయ జెండానే మన జాతీయ జెండాగా ఉండాలని వారి అభిమతం. కులమతాలతో నిమిత్తం లేకుండా ఒక నేరానికి ఒకే శిక్ష విధించాలని చెప్పే మన చట్టాలు సహజంగానే వారికి జీర్ణం కానివి. వర్ణం ప్రకారం శిక్షలు, హక్కులు, ఆస్తులు ఉండాలని మనుస్మృతి చెప్తుంది. అందుకనే అంబేద్కర్ మహర్ పోరాటం సందర్భంగా మనుస్మృతిని తగలబెట్టారు. అలాంటి మనుస్మృతి సాంప్రదాయవాదులకు శిరోధార్యం. మనుస్మృతిని తగలబెడితే వారు విలవిలలాడతారు. ఫ్యూడల్ ప్రభువుల ప్రాపకంతో వారి పాత్రతో మతతత్వ పార్టీలైన హిందూ మహాసభ, ఆర్‌ఎస్‌ఎస్, ముస్లింలీగ్ పుట్టుకొచ్చాయి. కనుక వాటికి ఇప్పటికీ ఫ్యూడల్ విలువల పట్ల వారికి మోజు. ఆ విలువలు కష్టజీవులనే కాదు, మహిళలనూ అణిచి వుంచాలని చూస్తాయి. భారత రాజ్యాంగం మహిళలకు సమాన పౌరసత్వాన్ని కల్పిస్తోంది. స్వతంత్ర పోరాటం సందర్భంగా సామాజిక, ఆర్థిక రంగాల్లో చేయాల్సిన పోరాటాన్ని, తన వర్గ స్వభావం వల్ల కాంగ్రెస్ నాయకత్వం వాయిదా వేసింది. స్వాతంత్ర్యం వచ్చాక వాటి సంగతి చూసుకోవచ్చని చెప్పింది. కాని స్వతంత్ర భారతంలో కూడా వాటిని సమగ్ర దృష్టితో చేపట్టలేదు. ఓటు బ్యాంకు రాజకీయాల దృష్టితో క్రమంగా మృదు హిందూత్వను అనుసరించింది. ముస్లింలలో ప్రజాస్వామిక సంస్కరణల కోసం ప్రయత్నించకుండా సాంప్రదాయ శక్తులను సంతృప్తి పరిచే విధానాన్ని అనుసరిస్తూ అంబేద్కర్ చేసిన హెచ్చరికను పెడచెవినబెట్టారు. తద్వారా ప్రభుత్వాలు మెలమెల్లగా రాజకీయ ప్రజాస్వామ్యానికీ ప్రమాదం తెచ్చిపెట్టాయి. అక్కడో నల్లరాయి ఇక్కడో తెల్లరాయి పేర్చినట్లుగా భారత రాజ్యాంగాన్ని రూపొందించి ఉంటే ఇంత కష్టపడాల్సిన అవసరం ఉండేది కాదని అంబేద్కర్ రాజ్యాంగ సభకు రాజ్యాంగాన్ని సమర్పిస్తూ చెప్పారు. పార్టీ క్రమశిక్షణకు పరిమితం కాకుండా సభ్యులు చర్చల్లో అనేక విషయాలను ముందుకు తెచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. అదే సందర్భంలో ఒక హెచ్చరిక చేశారు.

**సామాజిక దృక్పథంతో మీరు రాసే రచనలు**
**editor. prajapalana@gmail.com**
**మెయిల్ కు పంపించినచో ప్రజా పాలన**
**దినపత్రికలో ప్రచురించబడును**

# కొత్త ప్రభుత్వం "కుమ్మర్లను"ఆదుకోవాలి

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి75 సం''రాలైనప్పటికి కేంద్ర 'రాష్ట్ర ప్రభుత్వాలు స్వదేశీ ఉత్పత్తుల" అభివృదికి. గ్రామీణ వృత్తుల ఆధునీకీకరణకు ఆధునాతన సాంకేతికతను ఆశించిన మేరకు అందించడలో విఫలమైనాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టికి ఉపాధి అవకాశాల కల్పనలో బహుముఖ పాత్ర పోషించే "కులవృత్తులైన" చేనేత ' కుమ్మర వృత్తి' 'వడ్రంగి మేదరి: మొదలగు వృతుల ఉత్పత్తులకు మార్కెట్లో గిరాకీ తగ్గడం వల్ల గ్రామీణ వృత్తుల మీద ఆధారపడిన కార్మికులు ఈవృత్తులను వదులుకొని పట్టణాలకు వలస వెల్లి రోజువారి కూలీలుగా మారి శ్రామిక మార్కెట్లో ఎక్కువ గంటలు పనిచేసన్తా తక్కువవేతనాలు పొందతు శ్రమ దోపిడికి గురౌతున్నారు. కార్మిక చట్టాల ప్రకారం కనీస వేతనాలు పొందడం లేదు. లిగ్రామీణచేతివృత్తులు కూడు పెట్టని దశకు చేరుకున్నాయిలి. నాడు కుల వృత్తిని మించింది లేదు గువ్వల చెన్నా" అన్న నానుడి నేడు " కుల వృతులను వదిలిందే మిన్న అన్న సంస్కృతి సమాజంలో చోటు చేసుకుంది. తెలంగాణ రాష్ట్రంలో కొలువు తీరనున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాష్ట్రములోని 14 లక్షల జనాభా వున్న కుమ్మర కుల వృతిదారులు సమస్యలు పరిష్కరిస్తుందనే ఆశతో ఉన్నారు .తమ ఆకాంక్షలు ఆశలు తీర్చి కుమ్మర్ల జీవితాలలో వెలుగు తేస్తుందనే కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. లిప్లాస్టిక్ డిమాండ్ కుమ్మర వృత్తిలిలిప్లాస్టిక్ ఆదారిత ఉత్పత్తులకు' సిల్వర్ వస్తువులకు మార్కెట్లో గిరాకీ పెరిగటం. వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కుమ్మరవృత్తి కనుమరుగయ్యే పరిస్థితులు దాపురించాయి . ఎంతో కళానైపుణ్యంతో కూడుకున్న కుమ్మర వృత్తి ఆదరణలేక అంతరించే పరిస్థితులు నెలకొన్నాయి. కుమ్మర వృత్తి కుమ్మర్లకు కూడు పెట్టని దుస్థితికి చేరడం శోచనీయం.

**మానవ నాగరకత కుమ్మర వృత్తి**

"మానవ నాగరికతకు తొలి మెట్టు కుమ్మరి కుండ ఆయువు పట్టుగా" నిలిచి మానవ చరిత్ర' సంస్కృతి వారసత్వ విశేషాల అధ్యయనానికి దోహద పడే కుమ్మర వృత్తి అంతరించే దశకుచేరుకుంది. మానవాళికి ఆహారాన్ని వండుకోవడానికి వంట పాత్రలు సమకూర్చి మానవ జాతికి శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అందించి ప్రజారోగ్యానికి' పర్యావరణ పరిరక్షణకు ప్రతినిధిగా నిలిచిన కుమ్మర వృత్తి కార్మికులు ఉపాధి లేక దుర్భరమైన జీవితాలను వెల్లదీస్తున్నారు. లిమానవ మనుగడ కుమ్మరవృత్తి మనిషి పుట్టుక' పెళ్లి ' చావు మరియు దైవకార్యక్రమాల్లో కుమ్మర ఉత్పత్తులు కుండలు 'గురుగులు కూర వండు కోవటానికి ఎసులలు అటికెలు నీటినిలువ కు తొట్టిలు రంజాన్లు 'కడువలు 'పెళ్ళిలో ఐరేని కుండలు వినియోగిస్తారు. మానవ మనుగడలో మట్టి పాత్రలు ప్రధాన పాత్ర పోషించాయన్నది చారిత్రిక సత్యం ఇందుకు సంబంధించి న అనేక చారిత్రిక సర్వేల్లో వెల్లడైంది .మోహంజదారో" హరప్ప మసపుటోనియా' సిందూ



నాగరికత అద్యయనాల్లో వెల్ల డైంది . ఆధునిక కాలంలో నూతన గృహ ప్రవేశం' ప్రభుత్వ భవనాల "భూమి పూజ" 'దేవతలకు సమర్పించే బోనాలు మొన్నగు "శుభ "మరియు ' దైవ' కార్యక్రమాల్లో కుమ్మర కుండలు ఉపయోగిస్తారు. మానవ జాతి మనుగడకు నాగరికత :సంస్కృతికి'కుమ్మర కుండకు విడదీయలేని సంబంధం వుంది. మట్టిని నమ్ముకొని మానవాళి మనుగడ కొరకు పర్యావరణ రక్షణకు కవచంగా నిలిచిన కుమ్మర కుల వృత్తి ఉనికిని కోల్పోయే స్థితిలో వుంది.

**ప్రపంచీకరణ కుమ్మర వృత్తి**

ప్రపంచీకరణ విసిరిన" పంజాకు" "కుమ్మర వృత్తి కుదేలైంది..వేగంగా విస్తిరిసన్తున్న పారిశ్రామికీకరణ' కార్పోటీకరణ 'పట్టణీకరణ 'జనాభా పెరుగుదల ప్లాస్టిక్ వినియోగం పై పెరిగిన క్రేజీ మార్కెట్ ప్రకటనలవల్ల ప్రజల్లో పెరిగిన విదేశీ సంస్కృతి 'స్టీలు పాత్రలు' ప్లాస్టిక్' సిల్వర్ అల్యూమినియం వినియోగం బాగాపెరిగింది. మార్కెట్ మాయాజాలంలో మట్టి పాత్రలకు ఆదరణ లేక డిమాండ్ తగ్గింది. కుమ్మర వృత్తి కుడుపెట్టని స్థితికి దిగజారింది. కులవృత్తినివదులుకొని ప్రైవేట్'అసంగటితరంగంలోకి కుమ్మరి వృత్తి కార్మికులు వలస పోయి అల్ప వేతనాలకుపనిచేస్తూ శ్రమ దోపిడీకి గురై రెక్కాడితే డొక్కాడని స్థితిలో కఠిన పేదరికం అనారోగ్యానికి గురవుతున్నారు . దినసరి వేతనకార్మికులుగా' అడ్డాకూలీలుగ జీవితాలు వెల్లధీస్తున్నారు.

**పేదరికం కుమ్మర వృత్తి**

జీవనోపాధి లేక దారిద్ర్య రేఖ కింద జీవిస్తూ కనీస అవసరాలు తీర్చుకోలేని దుస్థితిలో వున్నారు. విద్య' వైద్యము 'పక్కాగృహ వసతి లేక నిరుద్యోగం 'నిరక్షరాస్యత 'ఆకలిచావులు 'అల్ప పౌష్ఠికాహారం అప్పుల బాధలు కుమ్మర వృత్తిదారుల పాలిట శాపాలుగా మారాయి .

**ప్రభుత్వం కుమ్మర్ల సంక్షేమం**

ప్రభుత్వాలు' కుమ్మరవృత్తి దారుల సంక్షేమానికి ఆర్థిక వికాసానికి సమగ్రమైన పథకాలు అమలు చేయక పోవటం వల్ల కుమ్మర వృత్తి దారుల సాంఘిక 'ఆర్థిక వికాసం సామాజిక వికాసం ఎండ మావిగా మారటం శోచనీయం. ప్రభుత్వాలు ఇతర కులవృత్తులను అన్ని రకాలుగా ఆదుకుంటున్నట్లే కుమ్మ వృత్తిని ఆదుకోవాలి. మానవ నాగరికత మానవచరిత్ర నిర్ధారకు ఉపయోగపడే కుమ్మరవృత్తి కిపూర్వ వైభవం తేవాలి.

**ఆధునిక సాంకేతికత కుమ్మర వృత్తి**

ఆధునిక సాంకేతికతను' సమాచార రంగములో వస్తున్న నూతన సాంకేతిక విధానాల పట్ల ఉత్పత్తి పద్ధతుల పట్ల కుమ్మర యువతకు అవగాహన శిక్షణా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించి కుమ్మర యువతలో శ్రామిక సామర్థ్యం పెంపొందించే ఉత్పత్తి విధానాలకు "వృత్తినైపుణ్యాభివృద్ధి"కి పెద్దపీట వెయ్యాలి.

**మౌలిక వసతులు కల్పించాలి**

ప్రభుత్వం కుమ్మర వృత్తికి మౌలిక సదుపాయాలు కల్పించాలి. కుండలు కాల్చడానికి వాము బట్టీలు పెట్టుకోవటానికి స్థలము సమకూర్చాలి. చెరువుల్లో నుండి కుమ్మరి మట్టిని ఉచితంగా తీసుకోవడానికి ప్రభుత్వం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులు అమలుకు నోచుకోక పోవడం వల్ల కుమ్మర మట్టిని పొందడంలో కుమ్మర వృత్తి దారులు సమస్యలు ఎదుర్కొంటున్నారు .మట్టి సేకరణ తదితర ముడిసరుకులు ' తమ ఉత్పత్తులకు స్టోరేజ్ వసతి అడవుల నుండి ఉచితంగా కలప వాము కాల్చడానికి పొరక తీసుకోవడానికి ప్రభుత్వం జారీ చేసిన జీవోలను రెవిన్యూ అటవీ శాఖ అధికారులు అమలు చేసేట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చెయ్యాలి . ప్రభుత్వాలు విధించే సీవరేజ్ సెస్ ' వృత్తి పన్ను నుండి కుమ్మర వృత్తిని మినహాయించాలి. చాకలి 'మంగలి వృత్తులకు ఇస్తున్నఉచిత విద్యుత్తు సౌకర్యం కుమ్మర వృత్తి దారులు ఉపయోగించే విద్యుత్తు "సారెకు" ఇవ్వాలి. కుమ్మర వృత్తి దారులకు షేడ్స్ నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగాభూమిని స్థలాన్ని కేటాయించాలి.. గ్రామ పంచాయితీ 'మున్సిపల్ మున్సిపల్ కార్పొరేషన్ నెలకొల్పిన షాపింగ్ కాంప్లక్స్ ల్లో కుమ్మర వృత్తి దారుల ఉత్పత్తుల అమ్మకానికి ఉచితంగా వసతి కల్పించాలి. రైతు బజారులో కుమ్మర. వృత్తి ఉత్పత్తులు అమ్ముకోవడానికి స్థలం కేటాయించాలి. కుమ్మర్ల ఉత్తపత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి. మార్కెట్లో విధించే పన్నుల నుండి మినహాయింపు ఇవ్వాలి.

**కుమ్మర్లను బి 'సి''ఏ''గ్రూపులో చేర్చాలి**

ప్రభుత్వం కుమ్మర్లు సామాజికంగా' విద్యా ఉద్యోగ' రంగాలలో అభివృద్ధి చెందడానికి విద్యా 'ఉపాధి రంగాల్లో పోటీని ఎదుర్కోవటానికి "కుమ్మర కులాన్ని" బిసి ఏ"గ్రూపులో చేర్చాలి. విశ్వవిద్యాలయ స్థాయిలో పాటరీ కోర్స్ ను పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. లిఇన్సూరెన్స్ పథకాలులిలికేంద్ర ప్రభుత్వ భవిష్య నిధి పథకం ఇన్సూరెన్స్

'ఆరోగ్య భీమా సౌకర్యం కుమ్మర వృత్తి కార్మికులకు వర్తింప చెయ్యాలి .కుమ్మర వృత్తి కార్మికులను కార్మిక మంత్రిత్వ శాఖలేబర్ గుర్తింపు కార్డులు ఆరోగ్య కార్డులు ఉచితంగా అందించాలి.

**నేదునూరి కనకయ్య**
**హైదరాబాద్ 9440245771**

# ఆదివాసీ హక్కుల ఉద్యమకారుడు

గొంతులేని ఆదివాసీలకు జీవితపర్యంతం బలమైన గొంతుగా నిలచిన బ్రహ్మదేవ్ శర్మ (బిడి శర్మ) మధ్యప్రదేశ్ గ్వాలియర్‌లో జన్మించాడు. గణితశాస్త్రంలో డాక్టరేట్ డిగ్రీ పొంది 1952 53లో సివిల్ సర్వీసెస్‌లో చేరాడు. బస్తర్ జిల్లాకు కలెక్టర్‌గా పనిచేసినప్పటి నుండి డిసెంబర్ 6, 2015న చనిపోయే వరకు ఆదివాసుల పక్షాన నిలబడ్డాడు. 26 నవంబర్ 1949న భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగసభ ఆమోదించడంతో భారత ప్రజలకి హక్కులు లభిస్తే, ఆ రోజే ఈ దేశంలోని గిరిజనులు, ఆదివాసులు తమ స్వేచ్ఛను, సహజ హక్కులను కోల్పోయారని అన్ని వేదికలపై ఆయన నిక్కచ్చిగా ప్రకటించేవాడు. బిడి శర్మ ఆదివాసుల హక్కుల కోసం మాట్లాడటంతో అప్పటి ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వ పరోక్ష మద్దతుతో కొనసాగుతున్న మైనింగ్ మాఫియా ఆయన మెడలో చెప్పుల దండవేసి నగ్నంగా ఊరేగించిన ఘటనను ప్రజాస్వామికవాదులెవరూ మర్చిపోలేరు. దానిని ఎవరు గుర్తు చేసినా, న్యాయం కోసం నిలబడ్డవారు ఇలాంటి సంఘటనలకు సిద్ధంగా ఉండాలి అనేవారు ఆయన. ఆదివాసీల జీవితాల్లో మార్పుకై పరితపించిన శర్మ చివరి వరకు వారి హక్కుల కోసం పోరాడాడు. బస్తర్ కలెక్టర్‌గా విధులు నిర్వహించినవాడు చివరి దశలో చిన్న రూం, నిండా పుస్తకాలతో, తలుపులు, తాళం లేని గదిలో ఉంటూ ఆదివాసీలతో మమేకమైపోయాడు. అధికారిననే అహం, ధన వ్యామోహం లేకుండా బాధ్యతలు నిర్వర్తించాడు. ఎస్సీ/ఎస్టీ కమిషన్‌ను నెలకొల్పాలనే నిర్ణయం విధానపరంగా తీసుకున్న తర్వాత, ఆ బాధ్యత బిడి శర్మ



చేపట్టాలని అప్పటి ప్రధాని కోరడంతో ఈ కమిషన్‌కు మొట్టమొదటి చైర్మన్‌గా నియమించబడ్డాడు. ఆదివాసుల హక్కుల కొరకు రాజ్యాంగంలో ఐదవ షెడ్యూలు కోసం అహర్నిశలు కష్టపడి రాజ్యాంగంలో చేర్పించిన మేధావి. ఉద్యోగ విరమణ తర్వాత భారత్ జన ఆందోళన్ అనే సంస్థను స్థాపించి ప్రజా ఉద్యమాలను నిర్మించాడు. నర్మదా బచావో ఆందోళనలో క్రియాశీలకంగా పనిచేశాడు. నర్మదా ప్రాజెక్టు పూర్తికావడానికి ముందే బాధితులందరికి నష్టపరిహారం, పునరావాసం, వసతులన్ని కల్పించాలని పోరాడాడు. సర్దార్ సరోవర్ డ్యామ్ వలన విస్థాపనకు గురౌతున్న ఎస్సీ, ఎస్టీలకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశాడు. నార్త్ ఈస్టరన్ హిల్ యూనివర్సిటీకీ వైస్ చాన్స్‌లర్‌గా ఉన్నప్పుడు అనేక వసతులు, సౌకర్యాలతో ఆదివాసులు ఉన్నత విద్యను అభ్యసించేలా తోడ్పడ్డాడు. బ్రహ్మదేవ్ శర్మ ఆలోచనలకు, ఆచరణకు భిన్నంగా నేడు ఆదివాసుల జీవితాలు విధ్వంసమవుతున్నాయి. అడవిని చేజిక్కించుకోవడానికి లక్షలాది సాయుధ బలగాలతో కార్పొరేట్ సెక్యూరిటీలతో నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయి. బహుళజాతి కంపెనీలు చొరబడి ఆదివాసీ వనరులను దోపిడీ చేస్తున్నాయి. 1995లో ఏర్పాటు కాబడ్డ భూరియా కమిటి సూచనల్లో భాగంగా 1996లో ఆదివాసీలకు అండగా 'పెసా' చట్టం రాజ్యాంగంలో చేరింది. ఈ చట్టం ఆదివాసీలకు, గిరిజనులకు వెన్నుముకగా నిలుస్తుందని, గ్రామసభ కీలకమైన పాత్ర నిర్వహిస్తుందని బీడీ శర్మ విశ్వసించాడు. కానీ మహారాష్ట్ర జిల్లా గడ్చిరోలి ప్రాంతంలో లాయిడ్స్ కంపెనీకి వ్యతిరేకంగా 50 గ్రామాల గ్రామ సభలు కంపెనీకి వ్యతిరేకంగా తీర్మానంచేసి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళినప్పటికి కంపెనీ పనులు ఆపలేదు. ఆదివాసులు తిరగబడి కంపెనీ వాహనాలను దగ్ధం చేస్తే ప్రభుత్వం ఆదివాసులపై దుర్మార్గమైన నిర్బంధాన్ని కొనసాగించి అనేకమందిని హత్య చేసింది. అదేవిధంగా, అనాదిగా రాజ్యాంగం సహకరించినా రాజ్యం సహకరించనందున ఆదివాసీ ప్రాంతాలన్నీ పెట్టుబడిదారుల గుప్పెట్లోకి వెళ్ళిపోతున్నాయి. బస్తర్ కలెక్టర్‌గా ఆచరణలో అడవిలోని ఆదివాసులకు జెల్, జెంగిల్, జమీన్లపై పూర్తి అధికారం కల్పించేందుకు, గ్రామసభ అధికారాల ద్వారా ఆదివాసుల జీవితాల్లో వెలుగు నింపేందుకు బీడీ శర్మ చేసిన కృషి విశేషమైనది. కానీ నేటి ప్రజా వ్యతిరేక పరిపాలనలో ఆదివాసీ చట్టాలు పార్లమెంటుకే పరిమితమైపోయాయి. నిత్యం హత్యలు, అత్యాచారాలతో ఆదివాసీల జీవనం కల్లోలితంగా మారిన ప్రస్తుత స్థితిలో బ్రహ్మదేవ్ శర్మ ఆలోచనలు, విలువల పరిరక్షణకు కృషిచేయాల్సిన అవసరం ఉంది. ఆదివాసుల జీవించే హక్కును కాపాడటానికి ఆయన చూపిన మార్గంలో పయనించాల్సిన బాధ్యత బుద్ధి జీవులుగా మనందరిపైనా ఉంది.

## రైతులు ఆందోళన చెందొద్దు : మంత్రి కారుమూరి



మొగల్తూరు, డిసెంబరు 6 (ప్రజాపాలన ప్రతినిధి) :తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని ప్రభుత్వం అండగా వుంటుందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగ దారుల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మొగల్తూరు మండలం మొగల్తూరు గ్రామ శివారు మిచాంగ్ తుఫాన్ కారణంగా నీట మునిగిన వరి చేలను, ధాన్యం రాశులను మంత్రి కారుమూరి పరిశీలించి రైతులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో తుఫాన్ నేపథ్యంలో తేమతో సంబంధం లేకుండా ధాన్యాన్ని రైతుల నుంచి మిల్లర్లు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని అన్నారు. తుపాను కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టాలు జరగకుండా అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సమాయాత్తం చేశారని తెలిపారు. ముఖ్య మంత్రి పశ్చిమగోదావరి జిల్లాలో తుఫాన్ పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఆరాతీసి సహాయక చర్యలపై ఆదేశాలు జారీ చేశారని మంత్రి తెలిపారు. భారీ వర్షాల కారణంగా కళ్ళాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని తేమ శాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని రైసు మిల్లర్లను కోరామని వారు వెంటనే అంగీకరించారని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ధాన్యం కొనుగోలు విషయంలో పలు సడలింపులు జారీ చేసిందని ఆఫ్ లైన్లో కొనుగోలు, జిపిఎస్ లేకపోయినా తమ స్వంత వాహనాలు వినియోగించు కోవచ్చని ఆయన తెలిపారు. ఇంకా కోతలు కొయ్యని వరి పంటలను రైతులు అధికారుల సలహాలు పాటించి కోతలు కోసుకోవాలని మంత్రి కారుమూరి సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట ఆర్డీవో యం అచ్యుత అంబరీష్, తహశీల్దారు జి. అనితా కుమారి, వ్యవసాయ శాఖ అధికారి యస్.అబ్దుల్ రహీమ్, రైతులు, రైతు భరోసా కేంద్రం, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బహుజన సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా అంబే ద్కర్ 67వ వర్ధంతి వేడుకలు




నందిగామ డిసెంబర్ 6 ప్రజాపాలన ప్రతినిధి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి వేడుకలు పట్టణంలో యాద వ బజార్ దగ్గర గల పార్ట్ కార్యాలయంలో బహుజ న సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగానిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బహుజన స మాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పు ష్పరాజు పాల్గొన్నారు. ముందుగా డా. అంబేద్కర్ చి త్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళి అర్పిం చారు. ఈ సందర్భంగా పుష్పరాజు మాట్లాడుతూ,మా నవ హక్కులు నిరాకరించబడిన శూద్ర, దళిత వర్గాల కు విద్య, ఉద్యోగ, రాజకీయ అనేక హక్కులు, అవకా శాలు పోరాడి సాధించి పెట్టారని, ఈ హక్కుల ద్వారా లబ్ధి పొందిన వారు తమ భవిష్యత్ తరాల అభ్యు న్న తి కొరకు కృషి చేయాలని, తాను పోరాడి సాధించిన ఓటు హక్కు ద్వారా దళిత బహుజనులు రాజ్యాధికా రం సాధించాలని ఆకాంక్షించారని, ఆయన ఆశయ సాధన కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈకార్యక్రమం లో విశ్రాంత ఏ ఎస్ ఐ శ్రీ య రగొర్ల రామారావు, పౌర సమాజ ఐక్య సేవా సంఘం నాయకులు శ్రీ కురగంటి హనుమంతరావు, పాస్టర్ యద్ధనపూడి వెంకటేశ్వర్లు పలువురు ఎస్సి ఎస్టీ ఉ ద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## పంట నష్ట పోయిన ప్రతి రైతు ను ప్రభుత్వం ఆదుకోవాలి



బాపట్ల జిల్లా ప్రజపాలన డిసెంబర్ 6కర్లపాలెం మండలం, నందాయపాలెం గ్రామంలో పంటపొలాలను ఆయన తెలుగుదేశం పార్టీ నాయకులతో కలసి పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తుఫాన్ కారణంగా పంట పొలం లో నీరు నిల్వ ఉండటంతో రైతు తీవ్రంగా నష్ట పోయారని అన్నారునష్ట పోయిన రైతును ప్రభుత్వం ఆదుకొవాలని అన్నారు వ్యవసాయ అధికారులు మండలం లో ఎంత మేరకు నష్టం జరిగిందో అంచనా వేసి రైతులకు ఆదుకోవాలన్నారుఈ కార్యక్రమం లో కర్లపాలెం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అద్వాన్నంగా ఉన్న మంత్రి సొంత గ్రామంలో జగనన్న కాలనీ..



ప్రజాపాలన ప్రతినిధి కొవ్వూరు:తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలంలో కుమారదేవం గ్రామంలో మమ్మల్ని ఆదుకోండి అంటున్న జగనన్న కాలనీ వాసులు ,తుఫాను తీరం దాటడం తో గాలి వర్షం అధికంగా ఉండటంవల్ల జగనన్న కాలనీలు నీట మునిగి జనజీవనం అస్తవ్యస్తం అయిందని, నవరత్నాల్లో భాగంగా మాలాంటి పేదవారికి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాకు ఆంధ్ర రాష్ట్రంలో ఎక్కడ లేని విధముగా 1.5 సెంట్లు స్థలం ఇచ్చి ప్రభుత్వం నుండి కొంత ఆర్థికంగా సహాయం అందించటం వల్ల మేము అద్దులకు ఉండలేక మిగతా సొమ్మును అప్పుచేసి ఇక్కడ ఇల్లు నిర్మించుకోవడం జరిగింది అయితే ఇక్కడ సరియైన రోడ్లు మురుగు నీరు పోయే మార్గం లేక ఈ నీళ్లలో చిన్న పిల్లలతో, పెద్దవారితో విషసర్పాలు, దోమలతో చాలా ఇబ్బంది పడుతున్నామని అంతేకాకుండా మాకు పనులు లేక నీటిలో బయటికి రాలేక గత రెండు రోజుల నుండి కరెంటు లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతూ ఉన్నామని దయచేసి అధికారులు ప్రభుత్వం నుండి సహాయం అందించి మమ్మల్ని ఆదుకోవాలని కాలనీవాసులు మాట్లాడుతూ .మంత్రివర్యులు అయిన తానేటి వనిత సొంత గ్రామము పరిస్థితి ఇలా ఉంటే ఎలాగ అని ఇప్పటికైనా మంత్రి చొరవ తీసుకోవాలని తమ ఆవేదనను తెలిపారు...

## తుఫాన్ బాధితులకు కాపు సేవా ట్రస్ట్ చేయూత

**జనసేనపార్టీ నేత రావూరి బాలాజీ ఆధ్వర్యంలో తుఫాన్ బాధితులకు అన్నదానం. కొనసాగుతున్న కాపు సేవా ట్రస్ట్ సేవా కార్యక్రమాలు**



చీరాల, డిసెంబర్ 06, ప్రజాపాలన : జనసేన పార్టీ నేత రావూరి బాలాజీ ఆధ్వర్యంలో, కొనసాగుతున్న కాపు సేవా ట్రస్ట్ సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా, చీరాల సెయింట్ఆన్స్ స్కూల్ సమీపంలోని అరవ కాలనీ తుఫాన్ బాధితులకు, దండుబాటలోని కోటయ్య వృద్ధాశ్ర మంలో అన్నదానకార్యక్రమాలు నిర్వహించారు. స్వర్గీయ రావూరి వెంకటసుబ్బయ్య, మీనాక్షమ్మల జ్ఞాపకార్థం, చీరాల కాపు సేవా ట్రస్ట్ ఆధ్వ ర్యంలో, శ్రీమతి డొక్కా సీతమ్మ, పవన్ కళ్యాణ్ బాబుల స్ఫూర్తితో, నిరంతరం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాలలో భాగంగా, ట్రస్ట్ వ్యవస్థా పకులు రావూరి వెంకటేశ్వర్లు, కోటేశ్వరమ్మ ల నిర్వహణలో, జనసేన పార్టీ నేత రావూరి బాలాజీ ఆధ్వర్యంలో, జనసైనికుల సమిష్టి కృషితో, మిచౌంగ్ తుఫాను కారణంగా, కురిసిన భారీ వర్షాలకు, ఇళ్లల్లో నీళ్లు నిలిచి, అవస్థలు పడుతున్న అరవకాలనీ ప్రజలకు, వృద్ధ శరణాలయం లోని వారికి అన్నదానం చేశారు.కాపు సేవా ట్రస్ట్ సేవలను ప్రశంసిస్తూ, ట్రస్ట్ నిర్వాహకులను, జన సైనికులను, ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో జనసేనపార్టీ నాయకులు రావూరి బాలాజీ, కాటంగారి జ్యోతి, కాటంగారి బ్రహ్మయ్య, గొలకారం వాసు, బేల్దారుమేస్త్రి బాలాజీ, చిచ్చుల సుబ్బయ్య, చిచ్చుల పద్మ, చిచ్చుల మణి, త్రోవి వెంకట సుబ్బమ్మ, పసుపులేటి జానకి మోహనరావు, వీర మహిళలు, జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తాం: ప్రభుత్వ విప్ గ్రంధి



వీరవాసరం, డిసెంబర్ 6 (ప్రజాపాలన ప్రతినిధి) :రైతులు ఆందోళన చెందవద్దని ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు జారీచేశారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. తుఫాన్ కారణంగా వీరవాసరం మండలం లో నేలకొరిగిన పంట పొలాలను, సుడిగాలితో నష్టపోయిన గృహాలను బుధవారం ఆయన పరిశీలించారు. ముందుగా వీరవాసరం, తోలేరు, పడమటిపాలెం, కొండేబట్లచెరువు గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను ప్రభావం కారణంగా రైతులు నష్టపోవడం జరిగిందని ఈ తుఫాను పది రోజులు దాటితే రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవ డానికి అవకాశం ఉండేదని అన్నారు. రైతులకు వచ్చిన కష్ట కాలాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని గ్రామాన్ని యూనిట్ గా చేసుకుని క్రాఫ్ ఇన్సూరెన్స్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. పంటకు సంబంధించి ప్రభుత్వం ముందు గానే రైతులను సాగుకు సన్నద్ధం చేసిందని కొన్నిచోట్ల రైతులు సకాలంలో సాగు చేసుకున్నారని మిగిలినవారు ఆలస్యంగా సాగు చేసుకోవడం జరిగిందని ప్రస్తుతం రైతులు నష్టపోయిన పంటను చూస్తే తెలుస్తుందని అన్నారు. తడిసిన ధాన్యాన్ని రైతులు తమకు దగ్గరలో ఉన్న మిల్లులకు విక్రయించుకునే అవకాశాలు కూడా ప్రభుత్వం కల్పించిందని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నంత కాలం రైతులకు వ్యవసాయం పండగ మాదిరిగానే ఉంటుందని అన్నారు. రైతులకు ఏ కష్టం వచ్చినా తానున్నానంటూ ముఖ్యమంత్రి రైతులకు అండగా నిలబడ్డారని గత నాలుగున్నర ఏళ్ళుగా రైతులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉందనే విషయం రైతులకు తెలుసుని అన్నారు. ఈ తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు దాన్యం తడిసిపోయిందని రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావద్దని తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.సుడిగాలి కారణంగా దెబ్బతిన్న గృహాలకు, కుటుంబాలకు ప్రభుత్వపరంగా నష్టపరిహారం ఇప్పించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఒక్కసారిగా సుడిగాలి రావడంతో కొన్ని గృహాలు, వ్యాపార సముదాయాలు దెబ్బ తిన్నాయని, వారిని ఆదుకుంటామని ఆయన పేర్కొన్నారు. దెబ్బతిన్న ప్రతి గృహాన్ని ఆయన స్వయంగా పరిశీలించి, బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటివల్లి బాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొలగాని సత్యనారాయణ, జేసి ఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్, పార్టీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు, తాసిల్దార్ ఎం సుందర్ రాజు, ఎండిఓ జ్యోతి, వ్యవసాయ శాఖ ఏడి సిహెచ్ శ్రీనివాస్, ఏవో ఝాన్సీ, భోగిరెడ్డి శ్రీను, మండపాక రాంబాబు, మేకా శ్రీనివాస్, కడలి శ్రీరాములు, చికిలే మంగతాయారు, ఎర్రంశెట్టి శ్రీనివాస్, నాగరాజు శ్రీనివాసరాజు, నూకల కనకారావు, పోలిశెట్టి దాసు, ఇంటి రాఘవేంద్ర, గడ్డం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం అన్ని విధాలుగా...ఆదుకుంటుంది: ఎంపీటీసీ తాండ్రసాంబశివరావు



బాపట్ల జిల్లా ప్రజపాలన డిసెంబర్ 6 బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం నల్లమోతు వారి పాలెం సెగ్మెంట్ లో మిచౌంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన పంట పొలాలను పరిశీలించి, గ్రామంలో నష్ట పోయిన రైతులను పరామర్శించారు. నష్టపోయి కష్టాలలో ఉన్న రైతులను ఆదుకునే దిశగా తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరిన ఆ సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యులు మరియు బాపట్ల జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు. ఈ సందర్భంగా ఎంపీటీసీ తాండ్ర మాట్లాడుతూ ఆరుగాలం పండించిన పంట చేతికి వచ్చే సమయంలో ఈ విధంగా తుఫాన్ కారణంగా నష్ట పోవటం చాలా బాధాకరం అని తెలియ జేశారు. నష్ట పోయిన రైతులు ధైర్యాన్ని కోల్పోవద్దు అని, జగన్ మోహన్ రెడ్డి గారి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుంది అని భరోసా ఇచ్చారు. తన సెగ్మెంట్ లోని నల్లమోతు వారి పాలెం మరియు కొత్త నందాయ పాలెం గ్రామాలలో వరి, పచ్చి మిర్చి, వేరుసెనగ, మినుము, పెసర మరియు మొక్క జొన్న పంటలు వేసిన రైతులు పూర్తిగా దెబ్బ తిన్నట్లు తెలియ జేశారు. సంబంధిత వ్యవసాయ మరియు డ్రైనేజ్ అధికారులతో కూడా మాట్లాడి తక్షణమే చర్యలు తీసుకోని రైతులను ఆదుకోవాలని కోరారు. కౌలు రైతుల ను కూడా ప్రభుత్వం ఆదుకుంటుంది అని తెలియ జేశారు. రైతులు కూడా సంయమనాన్ని పాటించి అధికారులకు సహకరించాలి అని కోరారు. పంటలు పరిశీలన కార్యక్రమంలో వి ఆర్ ఓ సుధాకర్ రెడ్డి, అగ్రికల్చరల్ అసిస్టెంట్ నవ్యశ్రి, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది మరియు గ్రామ రైతులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.











**కావలెను**


స్నేహ గ్రూప్, హైదరాబాద్ నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
నెలకు రూ.15,000/- జీతం,
ట్రావెలింగ్ అలవెన్సు, ఇన్సెంటివ్ ఇవ్వబడును.
ఆసక్తి గలవారు మీ వివరాలని
ఈ క్రింది నెంబర్ కి వాట్సాప్ చేయగలరు.
7660027683, 91549 58315









## రైతు భరోసా కేంద్రాల్లో సంచులు లేక తడిసిన దాన్యపు రాసులు



ప్రజాపాలన ప్రతినిధి కొవ్వూరు: తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలంలో కుమారదేవం గ్రామంలో మమ్మల్ని ఆదుకోండి అంటున్న రైతులు,తుఫాను తీరం దాటడం తో గాలి వర్షం అధికంగా ఉండటంవలన చేతికి వచ్చిన ధాన్యం అమ్ముడామని రోడ్డుపై రాశులు గాచేసుకుంటే ఈ తుఫాను వలన రాశులు మొత్తం నీట మునిగిపోయాయి ధాన్యం మొలకెత్తినది ప్రభుత్వం వారు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు అని అన్నారు,కానీ అక్కడ సంచులు కరువు, ఐనా ఏదో విధంగా మిల్లులకు పంపితే తేమశాతం సరిగాలేదు అని అక్కడ కోతలు, దయచేసి అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి మా మొలకెత్తిన ధాన్యం కొనుగోలు చేయాలి అని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేసి,మేము మా భార్యల పుస్తెలు తాకట్టు పెట్టి కవులు వ్యవసాయ చేస్తున్నాము,మా పై ఆ ప్రకృతి కూడా కన్నెర్ర చేయడంతోరోడ్డున పడ్డాను అని మంత్రివర్యులు అయిన తానేటి వనిత సొంత గ్రామము రైతుల పరిస్థితి ఇలా ఉంటే ఎలాగ అని ఇప్పటికైనా మంత్రి చొరవ తీసుకోవాలని తమ ఆవేదనను తెలిపారు...

### మిచౌంగ్ తుపానువలన నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: సిపిఎం కార్యదర్శి కటారపు గోపాల్




నందిగామ డిసెంబర్ 6 ప్రజా పాలన ప్రతినిధి గత మూడు రోజులుగా వర్షాలకు గాను రైతులకు పంట నష్టం వాటిల్లింది పంటలకు పూర్తిగా నష్టపరిహారం ప్ర భుత్వం చెల్లించాలని సిపిఐ మండల కార్యద ర్శి కే గోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారుబుధవారం నం దిగామ మండలం పల్లగిరి, మాగల్లు,దాములూరు,కం చల , రాఘవాపురం,కమ్మవారిపాలెం తదితర గ్రామా లలో అకాల వర్షాలు వల్ల దెబ్బ తిన్న మాగాణి,పత్తి, మిర్చి తదితర పంటలను నాయకులు పరిశీలించా రు.ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ మండలం లో సుమారు వెయ్యి ఎకరాలలో వరి మాగాణి,పత్తి, మిర్చి తదితర పంటలకు పూర్తి నష్టం వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశారుతక్షణమే మిర్చి,మాగాణి రై తులకు నష్టపరిహారం యకరానికి 50వేల రూపాయ ల వరకు నష్టపరిహారం అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారుఈ కా ర్య క్రమంలో రైతులు నఉరా లక్ష్మి నారాయణ, సుధాకర్, ప్రదీప్ వెంకటేశ్వర్లు సిపిఎం నాయకులు గోపి నాయ క్,ఎవి నారాయణ,హస్సన్,తదితరులు పాల్గొన్నారు

## దేశం గర్వించదగ్గ మేథావుల్లో అగ్రగణ్యుడు అంబేద్కర్ :మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ డిసెంబర్ 6 ప్రజాపాలన ప్రతినిధి పట్టణం కాకాని నగర్ మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌ మ్య కార్యాలయం నందు బుధవారంభారత రాజ్యాం గ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సంద ర్భంగా తెదేపా ఎస్సీ సెల్ నేతలు, పట్టణ తెదేపా కౌ న్సిలర్లు, తెదేపా నేతలు, కార్యకర్తలతో కలసి మాజీ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనమైన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ రాజ్యాంగ రూపశిల్పి భారతదేశం గర్వించదగ్గ మేధావి ప్రపంచ దేశాలకు దిక్సూచి డాక్టర్ బి.ఆర్ అం బేద్కర్ అని ఆమె అన్నారుబహుముఖ ప్రజ్ఞాశాలి న్యాయ, సామాజిక, రాజకీయ, ఆర్థిక, ఆధ్యాత్మిక తది తర రంగాల్లో అపార జ్ఞానశీలి దేశ రాజకీయ, ప్రజా స్వామ్య, సాంఘిక వ్యవస్థలకు దిక్సూచి. వాటికి గట్టి పునాదులు వేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నా యకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పా ల్గొన్నారు

## అంబేద్కర్ ఆలోచన విధానాన్ని నేటి యువత ఆద ర్శంగా తీసుకోవాలి ఎమ్మెల్యే మొండితోక జగన్మోహ న్ రావు



నందిగామ డిసెంబర్ 6 ప్రజాపాలన ప్రతినిధి డాక్టర్ బి .ఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి కార్యక్రమాన్ని పురస్క రించుకొని వైసీపీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రప టానికి స్థానిక ఎమ్మెల్యే మొండితో క జగన్మోహన్ రా వు పూలమాలలు వేసి ఘనంగా అంజలి ఘటించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రతి ఒక్కరికి సమాన విలువలు ఉండాలనే ఆకాంక్షతో సమాన త్వ పు హక్కు సాధనకు అంబేద్కర్ చేసిన కృషి మాన వజాతి మనుగడ ఉన్నంత వరకు మరువలేనిద న్నా రుఅంబేద్కర్ ఆలోచన విధానాన్ని నేటి యువత ఆ దర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆ ర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

## అంబేద్కర్ కి నివాళులర్పించిన బత్తిన రామకృష్ణ




గోకవరం ప్రజాపాలన డిసెంబర్ 6: ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా కీర్తించబడుతున్న వారిలో ప్రథమ స్థానంలో బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఉన్నారని అంతటి ఘనత మన నేత మహానుభావుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మనందరం గర్వించదగ్గ విషయం అని మానవ హక్కుల ఫౌండేషన్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రధాన కార్యదర్శి, జాస్మిన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ బత్తిన రామకృష్ణ అన్నారు. మండలంలోని రంప ఎర్రం పాలెం గ్రామంలో బత్తిన రామకృష్ణ భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భం గా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మేధావిగా బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేటికీ కీర్తించబడుతున్నారు అంటే ఆ మహానుభావుని స్థాయికి ప్రపంచవ్యాప్తంగా ఏ ఒక్కరు నేటికీ సరిపోరని ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాలకు కృషి చేయడం తప్ప మనం చేయగలిగేది ఏమీ లేదని ఆయన అన్నారు. నేడు ప్రతి ఒక్కరు ఎంతో ఆసక్తితో రాజకీయాల వైపు వెళుతున్నారు అంటే ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఓటు వేసే హక్కు మహాను భావుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పెట్టిన బిక్షం అని స్వేచ్ఛ స్వతంత్రం కోసం ఆయన చేసిన పోరాటాలు మరువరానివని రామకృష్ణ అన్నారు. భారత రాజ్యాంగాన్ని రచించడానికి ప్రపంచ దేశాలలో తిరుగుతూ తన కుటుంబాన్ని భారత రాజ్యాంగాన్ని తయారు చేయడం కోసం త్యాగం చేశారని అటువంటి మహాను భావుడు మనకు దూరమై 67 సంవత్సరాల కావస్తుందని ఒక దళిత బిడ్డగా నేడు ఆ మహానుభావునికి నివాళులు అర్పించడం నా అదృష్టంగా భావిస్తున్నాను అని ఈ అవకాశాన్నిచ్చిన రంప ఎర్రం పాలెం అంబేద్కర్ యువజన సంఘానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన వారిలో గుల్ల రాంబాబు, గోలి రాజు, తలారి సన్నీ, గుడిసె నూకరాజు, గుడిసే సత్తిబాబు, చింతపల్లి ఏసు పోలవరపు పాండవులు పెనుగొండ సింహా చలం తదితరులు ఉన్నారు.

## రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి



నరసాపురం, డిసెంబర్ 6 (ప్రజాపాలన ప్రతినిధి) :మిచాంగ్ తుఫాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకు పూర్తిస్థాయి నష్టపరిహారం అందించాలని నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నరసాపురం మండలం లిఖితపూడి, సరిపల్లి, మల్లవరంలంక గ్రామాలలో మించాంగ్ తుఫాను, టోర్నడో సుడిగుండాల ప్రభావంతో నష్టపోయిన ప్రాంతాలను, పంట పొలాలను బుధవారం మాధవ నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ ప్రభావం గతంలో ఎన్నడూ లేని విధంగా ఉందని తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాల వలన చేతికి వచ్చిన పంట నీట మునిగి రైతులు పూర్తి స్థాయిలో నష్ట పోయారని అన్నారు. ఆక్వా రైతులు, మత్యాకారులు వర్షాల వల్ల వేటకు వెళ్ళలేక ఆర్థికంగా ఇబ్బందులు పడ్డా రని అన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పంట పొలాలు నీట మునిగి రైతాంగం పూర్తిగా నష్టపోయారని గత నాలుగు ఏళ్లుగా పంట బోదెలు, కాలువలు పూడికతీత లేక పోవడంతో పంట పొలాల్లో వర్షపు బయటకు వెళ్ళక పంటలు పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయని ఆయన విమర్శించారు. తుఫాన్, సుడిగాలుల వల్ల కొబ్బరిచెట్లు, షెడ్లు దెబ్బతిని నష్టపోయిన వారిని, ఆక్వా రైతులను, భారీ వర్షాలు వల్ల వేటకు వెళ్ళని మత్యాకార కుటుంబాలకు ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు. తుఫానుకు దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను త్వరితగతిన పునరుద్ధించాలని ఏ విధమైన పక్షపాతం లేకుండా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందించాలని మాధవ నాయుడు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈద సురేష్, కొట్టు పండు, తంగెళ్ళ నాగేశ్వరరావు, కొండేటి శ్రీను, మెరుగుమువ్వల రాంప్రసాద్, యంద్ర పెద్దిరాజు, యంద్ర బాలకృష్ణ, మంతెన రామరాజు, దాయిం మంగరాజు, పిట్టా చిట్టిబాబు, మోసుగంటి శేఖర్, నడిపుడి కృష్ణ, అందే రామకృష్ణ, తిరుమాని సుబ్బు, చల్లా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ కి నివాళి అర్పించిన ప్రభుత్వ విప్ సామి నేని ఉదయభాను



జగ్గయ్యపేట డిసెంబర్ 6 ప్రజాపాలన ప్రతినిధి రా జ్యాంగ రూపశిల్పి ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అం బేద్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలో ఆయన విగ్రహానికి ప్రభుత్వ విప్ సామినేని ఉదయ భాను పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పిం చా రు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూభారతదేశ ఔన్నత్యాన్ని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వవ్యాప్తం చే సిన మహోన్నత వ్యక్తి,దళిత బలహీన వర్గాల వికాసా నికి పాటుపడిన మహానేత అంబేద్కర్ అని కొని యా డారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజ లు తదితరులు పాల్గొన్నారు.

## తుఫాను వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి: ( సిపిఐ)

### బద్వేలు మండల కార్యదర్శి నాగ దాసరి ఇమ్మానుయేలు డిమాండ్




బద్వేల్ ప్రజా పాలన ప్రతినిధి:తుఫాను వల్ల పంట దెబ్బతిన్న రైతులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ బద్వేలు మండల కార్యదర్శి నాగదాసరి ఇమ్మానుయేలు డిమాండ్ చేశారు బుధవారం ఇటీవల రెండు మూడు రోజులుగా కురిసిన వర్షాలకు బద్వేల్ మండలంలో తిప్పనపల్లె ,జోగ్గారిపల్లె, ఎల్లు గారి పల్లె, కొత్తచెరువు, తిరంగాలాపురంలో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి రైతు సమస్యలు తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఇమ్మానుయేలు మాట్లాడుతూ బద్వేల్ మండలంలో చాలామంది రైతులు పంటకు గిట్టుబాటు లేదని భూములు బీడు పెట్టుకున్నారు ఏదో కొంతమంది రైతులు వరి పైరు పెట్టుకుంటే ఈ తుఫాను వల్ల పైరు మొత్తం నేలమట్టం అయిందని రైతులు వాపోతున్నారు ఇటీవల వచ్చిన వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపోయిన రైతులకు ఎకరాకు 30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ గా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అంతేకాకుండా మా పరిశీలనలో ఇంట్లో కరెంటు బిల్లు ఎక్కువ వస్తుందని రైతు భరోసా రావడంలేదని రైతులు వాపోతున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణం బద్వేల్ మండలంలోని పంట పొలాలను పరిశీలించి నష్టపోయిన ప్రతి రైతునుఆదుకోవాలని లేనిపక్షంలో రైతులను కూడగట్టి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఓబులేసు వెంకటరమణ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు

## మిచౌంగ్ తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన జనసైనికులు



బాపట్ల జిల్లా ప్రజపాలన డిసెంబర్ 6: బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండలం నల్లమోతు వారి పాలెం గ్రామం పరిధిలో మిచౌంగ్ తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి రైతులను పరామర్శించిన బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసి కుమారి, కర్లపాలెం మండల అధ్యక్షులు గొట్టిపాటి శ్రీకృష్ణ, చిలకల సురేంద్రబాబు,రాంబాబు, రాజేష్, రాధాకృష్ణమూర్తి, మణికంఠ, ఆంజనేష్, సుజిత్, నాగమల్లేశ్వరరావు, జనసైనికులు, రైతులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 67వ వర్ధంతి

### ఘన నివాళులర్పించిన బద్వేల్ అంబేద్కర్ కాలనీ నాయకులు



బద్వేల్ ప్రజా పాలన ప్రతినిధి:ప్రపంచం గర్వించదగిన ప్రముఖులలో ముఖ్యుడు మన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని బద్వేల్ పట్టణంలోని "అంబేద్కర్ కాలనీ" నాయకులు మౌలాలి, ఏసోబు, జయరాజు, చిన్నయ్య, ప్రసాద్, నాగరత్నమ్మ, నరసింహులు, అన్నారు.బుధవారం అంబేద్కర్ 67 వ వర్ధంతి సందర్భంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో ఉన్న అన్ని రకాల వ్యవస్థలకు రూపకల్పన చేసి మన దేశాన్ని ప్రపంచానికి తెలిసేలా చేసిన మహోన్నత వ్యక్తి మన అంబేద్కర్ అని రాజ్యాంగ శిల్పి, ప్రముఖ భారతీయ న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నేత, సంఘ సంస్కర్త, ఇతను అంటరానితనం, కుల నిర్మూలన కోసం ఎంత కృషి చేశారన్నారు,స్వాతంత్ర భారతదేశపు మొట్ట మొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రి, భారతరత్న, ఎవరి కులవృత్తిని వారు అనుసరించడం వల్ల ఎటువంటి పోటీలేని ఆర్థిక వ్యవస్థ భారత సమాజంలో ఉందని వారు సమర్థించారు.అంటరాని వారిగా భావిస్తున్న కులాలవారు తమ ఆత్మగౌరవాన్ని త్యాగం చేస్తూ సమాజం బాగు కోసం తాము చేసే వృత్తులను చేస్తున్నారని అటువంటి వారిని ఇతర వర్ణముల వారందరూ గౌరవించాలని అన్నారన్నారు. ఈ కార్యక్రమంలో, హమాలీ వర్కర్స్ తిరుపాల్, చిట్టి, గోపాల్, పాల్గొన్నారు.


## తుఫాను కారణంగా నష్టపోయిన పంట పొలాలకు వెంటనే ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించాలి: కరాలపాటి జానీ



దాచేపల్లి ప్రజాపాలన న్యూస్: మూడు రోజులుగా కురుస్తున్న తుఫాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పంటలు వర్షానికి మునిగిపోయి వరి పత్తి మిర్చి మినుము పంట పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి పలనాడు ప్రాంతంలో పంటలు పూర్తిగా దెబ్బతిన్న కారణంగా వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వరి పంటకు 20 వేల రూపాయలు మిర్చి పంటకు 50 వేల రూపాయలు పత్తి పంటకు 25000 వేల రూపాయలు ఎకరానికి నష్టపరిహారం కింద వెంటనే చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ తరఫున రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ మైనార్టీ డిపార్ట్మెంట్ కార్యదర్శి కరాలపాటి జానీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాచేపల్లి మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పంట పొలాలను క్షేత్రస్థాయిలో పర్యటించి పంట పొలాలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాలు పూర్తిస్థాయిలో పంట పొలాలు నీటితో నిండిపోయినటువంటి పరిస్థితి చేతికొచ్చిన వరి పూర్తిగా నీళ్లలో నాని పూర్తిగా వరి పంటలు దెబ్బ తినడం జరిగింది. అలాగే మిర్చి పత్తి పొలాలు కూడా నీట మునిగి పంట పొలాలు పూర్తిగా దెబ్బతిని రైతులు పూర్తిగా నష్టపోయే పరిస్థితి వచ్చింది. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రైతులని భరోసా ఇచ్చి రైతులను వెంటనే నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని అలాగే వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇళ్లను కూడా పరిశీలించి వారికి కూడా వెంటనే నష్టపరిహారం చెల్లించి అన్ని విధాల రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట పొలాలను పరిశీలించిన వారిలో పార్టీ కార్యకర్తలు ఉప్పు తరుణ్, ఉప్పు గోపి, కే అవినాష్, వినయ్ ,రైతులు కర్నాటి నాగేశ్వరావు, పుల్లయ్య తదితరులున్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేద్దాం

### ఘనంగా 67వ వర్ధంతి వేడుకలు



బ్రహ్మంగారి మఠం ప్రజా పాలన ప్రతినిధి: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని ఆయన ఆశయాలను విద్యార్థులు యువత కొనసాగించాలని సోమిరెడ్డిపల్లిబి1 పంచాయతీ అధికారి ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి వేడుకలు బ్రహ్మంగారిమఠం మండలంలోని స్థానిక ప్రభుత్వ కార్యాలయ సముదాయంలో ఉన్న అంబేద్కర్ విగ్రహ ప్రతిమ దగ్గర ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ రచనలో ప్రధాన భూమికలు పోషించి నూతన సమాజానిర్మానానికి పునాదులు వేసిన ప్రతిభ శాలి అంబేద్కర్ అని కొనియాడారు. నేడు దేశంలో నేటికీ కులవిపక్షత కొనసాగుతుందని వ్యవస్థలో మార్పుల కోసం యువత విద్యార్థి లోకం చైతన్యవంతులు కావాలని అంటరానితనం పై అలుపెరిగిన పోరాటం చేసి,అస్తిత్వ ఉద్యమాలకు దశదిశలను చూపిన స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని ఆయన అడుగుజాడల్లో కొనసాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి మండల కో కన్వీనర్ నారాయణ, జిల్లా యువజన నాయకులు క్రిష్ణ, చలపతి, ఆంజనేయులు, రసూల్, లెక్చరర్ చంద్రశేఖర్, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ జోస్యంపై విపరీత ట్రోల్స్



విజయవాడ, డిసెంబర్ 6, : జూనియర్ ఎన్టీఆర్ ప్రత్యక్ష రాజకీయాల్లో లేనప్పటికీ తెలుగు రాజకీయాల్లో ఆయన పేరు తరచూ వినిపిస్తూ ఉంటుంది. జూనియర్ ఎన్టీఆర్‌కు రాజకీయాలపై మంచి పట్టున్న సంగతి అందరికి తెలిసింది. 2009 ఎన్నికల సమయంలో తన తాత స్థాపించిన తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం ప్రచారం కూడా నిర్వహించారాయన. ఎన్నికల ప్రచారంలో ప్రత్యర్థులకు చెమటలు పట్టించారు. కాకపోతే ఆ ఎన్నికల్లో తెలుగుదేశం ఓడిపోవడం.. ఆ తరువాత టీడీపీలో చోటు చేసుకున్న అంతర్గత కలహాలతో ఎన్టీఆర్ రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో అప్పటి నుంచి ఆయన కెరీర్ మీదనే దృష్టిని సారించారు. ప్రస్తుతం ఎన్టీఆర్ కొరటాల శివ దర్శకత్వంలో 'దేవర' అనే సినిమాలో నటిస్తున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ సినిమాను వచ్చే ఏడాది విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఎన్టీఆర్ రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ ఆయనకు రాజకీయాలపై మంచి అవగాహన ఏ మాత్రం చెక్కు చెదరలేదు. జూనియర్ కి పాలిటిక్స్ పై మంచి నాలెడ్జ్ ఉందని, ప్రస్తుత రాజకీయాలను ఆయనెంతో శ్రద్ధగా గమనిస్తుంటాడని సన్నిహిత వర్గాలు చెబుతుంటాయి. అంతే కాదు గత కొంత కాలంగా ఏ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి రాబోతుంది అనేది జూనియర్ ఎన్టీఆర్ సరిగ్గా అంచనా వేస్తున్నారని ఆయన సన్నిహితుల నుంచి వినిపిస్తున్న మాట. తమిళనాడులో డీఎంకే పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని జూనియర్ ఎన్టీఆర్ ముందుగానే చెప్పారట. ఆయన చెప్పినట్టుగానే డీఎంకే అధికారంలోకి వచ్చింది. ఇక తెలంగాణలో కాంగ్రెస్ గెలుస్తుందని చాలా రోజుల కిందటే జూనియర్ అన్నారట. ఆయన అంచనా వేసినట్టుగానే తెలంగాణలో హస్తం పార్టీ జెండా ఎగురవేయడంతో తారక్ సన్నిహితులు షాక్ అయ్యారట. అంతే కాదు ఇప్పుడు వాళ్ళు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారట. ఎందుకంటే ఈసారి ఏపీలో టీడీపీదే అధికారమని ఇప్పటికే తన వాళ్ళతో ఎన్టీఆర్ ఎంతో నమ్మకంగా చెప్పారట. దీంతో తమిళనాడు, తెలంగాణ తరహాలోనే ఏపీలో కూడా జూనియర్ చెప్పిన ఫలితమే వస్తుందని సన్నిహితులు భావిస్తున్నారట. కాగా తారక్ అంచనా వేసినట్టుగా తెలంగాణలో కాంగ్రెస్ గెలవడంతో, ఆ ఆనందంలో ఆయన సన్నిహితులు ఈ విషయాన్ని వారి స్నేహితులతో పంచుకోగా, ఇది సోషల్ మీడియా ద్వారా బయటకు లీకైంది. జూనియర్ కొంతకాలంగా తెలుగుదేశానికి దూరంగా ఉంటున్నాడు. తెలుగుదేశం శ్రేణులు సైతం కొన్ని విషయాల్లో తారక్ పై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అలాంటిది ఏపీలో తెలుగుదేశం పార్టీదే అధికారమని ఎన్టీఆర్ తన సన్నిహితులతో చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆయన మళ్ళీ తెలుగుదేశానికి దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నాడా అనే అనుమానం కూడా వ్యక్తమౌతోంది. జూనియర్ ఉద్దేశం ఏదైనప్పటికీ ఏపీ విషయంలో ఆయన చెప్పిన జోస్యం నిజమయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఎందుకంటే ప్రస్తుత జగన్ సర్కార్ పై ఏపీ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ఎప్పుడెప్పుడు ఈ ప్రభుత్వాన్ని గద్దె దించుదామా అని ఎదురు చూస్తున్నారు. రాజకీయ విశ్లేషకులు సైతం ఈసారి తెలుగుదేశమే గెలుస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుత రాజకీయాలను ఎప్పటికప్పుడు దగ్గరగా గమనించే ఎన్టీఆర్ వంటి వ్యక్తి ఈమాత్రం అంచనా వేయడం పెద్ద విషయమేమీ కాదు.


## 60 మందికి సీట్లు గల్లంతే..!

విజయవాడ, డిసెంబర్ 6, :వచ్చే ఎన్నికల్లో వైసీపీ సిట్టింగ్ లను జగన్ మార్చనున్నారా? ప్రజా వ్యతిరేకత కలిగిన ఎమ్మెల్యేలకు ఈసారి టిక్కెట్ లేనట్టేనా? వారి స్థానంలో ప్రత్యామ్నాయ నాయకులకు అవకాశం కల్పించనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ముఖ్యంగా తెలంగాణ ఎన్నికల ఫలితాలను జగన్ గుణపాఠంగా తీసుకుంటున్నారు. అక్కడ సిట్టింగులను మార్చక పోవడం వల్లే బీఆర్ఎస్ ఓటమి చవిచూసిందని తెలియడంతో అన్ని విధాలా జాగ్రత్త పడుతున్నారు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓటమికి ప్రధాన కారణం ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకత. దీనిని అప్పట్లో చంద్రబాబు లైట్ తీసుకున్నారు. తనపై నమ్మకంతో ప్రజలు గెలిపిస్తారని విశ్వసించారు. కానీ ఆయన ఒకటి తలిస్తే.. ఏపీ ప్రజలు మరోలా తీర్పు ఇచ్చారు. వైసీపీకి అంతులేని విజయం కట్టబెట్టారు. తెలుగుదేశం పార్టీకి 23 స్థానాలకే పరిమితం చేశారు. ఇప్పుడు తెలంగాణలో సైతం అదే సీన్ కనిపించింది. చాలామంది సిట్టింగ్ ఎమ్మెల్యేలపై ప్రజా వ్యతిరేకత ఉంది. ఈ విషయాన్ని కెసిఆర్ సైతం గుర్తించారు. కానీ తనపై నమ్మకంతో ప్రజలు గెలిపిస్తారని భావించారు. కానీ ఆ అంచనా తప్పింది. ఇప్పుడు తెలంగాణ ఫలితం.. ఏపీలో సైతం రిపీట్ అవుతుందని విశ్లేషణలు ప్రారంభమయ్యాయి. ఇది జగన్కు ఏమాత్రం మింగుడు పడడం లేదు. దీంతో సిట్టింగ్ ఎమ్మెల్యేల మార్పు అనివార్యంగా మారనుంది. ఇప్పటికే జగన్ పలుమార్లు సర్వేలు చేయించుకున్నారు. వెనుకబడిన ఎమ్మెల్యేలను హెచ్చరించారు. ప్రజల్లోకి వెళ్లాలని ఆదేశించారు. లేకుంటే మార్చేస్తానని హెచ్చరించారు. దాదాపు 60 మంది ఎమ్మెల్యేలపై ప్రజా వ్యతిరేకత ఉందని ప్రచారం జరుగుతోంది. వారందరి స్థానంలో ప్రత్యామ్నాయ నాయకులను తీసుకురావాలని జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవైపు ప్రజా వ్యతిరేకత, మరోవైపు టిడిపి, జనసేన కూటమి కట్టడం జగన్ కలవరపాటుకు కారణం. ఆ 60 మంది సిట్టింగులను మార్చకుంటే మాత్రం దెబ్బ తినడం ఖాయంగా తెలియడంతో జగన్ అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తప్పనిసరిగా మార్పునకు మొగ్గ చూపుతున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# 4 నెలలు... లక్ష కోట్లు

అమరావతి, డిసెంబర్ 6, :ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాలుగు నెలల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం కనీసం లక్ష కోట్ల రూపాయలు అవసరమవుతాయని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మొత్తాన్ని ఎలాగైనా సమీకరించాలని ఆర్థికశాఖను ఆదేశిం చింది. దీంతో ఈ మేరకు ఉన్న అవకాశాలపై ఆర్థిక శాఖకు చెందిన ఉన్నతాధికారులు కసరత్తు చేస్తు న్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం కొద్ది రోజుల క్రితం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటంతో పథకాల అమలులో ఏ మాత్రం నిర్లక్ష్యం ఉండకూడదని ఈ సమావేశంలో సిఎం ఆదేశించినట్లు తెలిసింది. దీంతో ఆర్థికశాఖ ఉన్నతాధికారులతో పాటు, ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న మరికొందరు కూడా నిధుల సమీకరణపై దృష్టి సారించినట్లు తెలిసింది. లక్ష కోట్ల రూపాయలకన్నా మరికొంత ఎక్కువ మొత్తమే అవసరమౌతుందన్న అభిప్రాయాన్ని వీరు వ్యక్తంచేస్తున్నట్లు సమాచారం. కొన్ని పథకాలు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు కాలేదని, మరికొన్ని పథకాల్లో రకరకాల పేర్లతో లబ్ధిదారులను కుదించారని, అటువంటి లోపాలన్నింటిని తక్షణమే దిద్దుకోవాలని వివిధ ప్రభుత్వ శాఖలకు కూడా ఆదేశాలు వెళ్లినట్లు తెలిసింది. ముఖ్యంగా సామాజిక ఫించన్లు ఏ కారణంతోనైనా అందడం లేదన్న ఫిర్యాదు లబ్ధిదారుల నుండి రాకూడదని ప్రభుత్వం భావిస్తున్న ట్లు సమాచారం. దీంతో వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్య కూడా రానున్న నాలుగు నెలల్లో పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీనిని కూడా దృష్టిలో పెట్టుకుని నిధుల కొరత లేకుండా చూడాలని ఆర్థికశాఖకు సూచించినట్లు తెలిసింది. అక్టోబర్ వరకు పరిశీలిస్తే అనుకున్న ఆదాయం కన్నా తక్కువగానే రికార్డయింది. రాష్ట్ర, కేంద్ర నిధులతో కలిపి 2.60 లక్షల కోట్లు రావాల్సి ఉంటుందని అంచనా వేయగా, తొలి ఏడు నెలలకు లక్ష కోట్లుకన్నా తక్కువగానే వచ్చింది. ఇక మిగిలిన ఐదు నెలల్లో 1.10 లక్షల కోట్లు రావాల్సి ఉంటుందని చెబుతున్నారు. అనుకున్నట్లుగా ఆ మొత్తం ఆదాయం లభించినా కూడా చివరి నెలల్లో ఖర్చులు గణనీయంగా పెరుగుతాయని, అందుకే ఆ నిధులు ఎంతమాత్రం చాలవని ఆర్థికశాఖ అధికారులు అంటున్నారు.

# వెనిగండ్ల రాముకే టీడీపీ ఓటు



గుడివాడ, డిసెంబర్ 6, :కృష్ణాజిల్లా గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్ ఛార్జ్‌గా వెనిగండ్ల రామును నియమించిన సంగతి తెలిసిందే. అయితే రాము నియామకం వెనక ఆసక్తికరమైన పరిణామాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు పార్టీ ఇన్ ఛార్జిగా రావి వెంకటేశ్వరరావు కొనసాగుతున్నారు. ఆయన స్థానంలో ఎన్నారై రాము నియమితులయ్యారు. రావిని మార్చడంపై కృష్ణా జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది. తెలంగాణ ఎన్నికల ఎఫెక్ట్‌తోనే మార్పుచేసినట్లు తెలుస్తోంది. రావి వెంకటేశ్వరరావు నియోజకవర్గంలో తన అనుచరులతో కలిసి పర్యటించారు. పర్యటనలో తెలుగుదేశం పార్టీ జెండాలను కూడా ప్రదర్శించారు. దీనిపై అప్పుడే సోషల్ మీడియాలో పెద్ద చర్చ జరిగింది. పార్టీ అనుమతి లేకుండా వెంకటేశ్వరరావు గాంధీకి ఎలా ప్రచారం చేస్తారని ప్రశ్నించారు. అనే విషయమై రావి వెంకటేశ్వరరావు స్పష్టత ఇవ్వలేదు. అయితే తాజాగా రామును ఇన్ ఛార్జిగా నియమించడంతో ఆయన అధిష్టానానికి చెప్పకుండానే ప్రచారంలో పాల్గొన్నట్లు స్పష్టమైంది. అరికెపూడి గాంధీ 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున గెలుపొంది తర్వాత బీఆర్ఎస్ గూటికి చేరారు. 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీచేసి విజయం సాధించారు. గాంధీకి రావి ప్రచారంపై నాలుగురోజులు సోషల్ మీడియాలో పెద్ద దుమారం రేగింది. 2014 ఎన్నికల్లో గుడివాడ నుంచి పోటీచేసిన రావి వెంకటేశ్వరరావు కొడాలి నాని చేతిలో ఓటమిపాలయ్యారు. 2019 ఎన్నికల్లో దేవినేని అవినాష్ పోటీ చేసి ఓటమిపాలయ్యారు.

### ఏనుగుల దాడి.... ఓ రైతు మృతి

చిత్తూరు+పులిచెర్ల మండలంలో ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. ఎర్రపాపిరెడ్డిగారి పల్లి వద్ద ఏనుగులు గుంపు రైతులపై దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. రైతులు ఏనుగులను తరిమే ప్రయత్నంలో ఏనుగుల గుంపు తిరగబడి, గొర్రల కాపరి మస్తాన్ ను ఓ ఏనుగు తొండంతో కొట్టడంతో మస్తాన్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఏనుగులు తరచు తమ పంట పొలాలపై దాడులు చేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పంటపొలాలను ఏనుగుల దాడుల నుండి అధికారులు కాపాడాలని రైతులు వాపోతున్నారు. పంటపొలాలే కాకుండా తమ ప్రాణాలను కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేసారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పోస్ట్ మార్టం నిమ్మితం మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికు తరలించారు.

### మలాపురంలో భారీ వర్షం.. ఇళ్లలోకి చేరిన వర్షం నీరు

అమలాపురం:అంబెద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో భారీ వర్షం,ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. మంగళవారం రాత్రి నుంచి ఏడతెరుపు లేకుండా కురుస్తున్న వర్షాలకు పూర్తిగా ఇళ్ళు మునిగిపోయాయి. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీ మొత్తం ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. జనాలు బకెట్లతో బయటకు నీటిని. తొడుకుంటున్నారు. ఏకధాటిగా భారీ వర్షం కురవడంతో డ్రైనేజీలు పూర్తిగా మునిగిపోయి ఇళ్లలోకి నీ చేరింది. రాత్రి నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# చెవిరెడ్డి అంత పనిచేశారా..?



గుంటూరు, డిసెంబర్ 6,: తెలంగాణ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు ఏపీ సీఎం జగన్ సాయం చేశారా? ఇందుకుగాను ఓ సీనియర్ నేతను నియమించారా? ఎమ్మెల్యే అభ్యర్థులకు ఫండింగ్ చేశారా? పొలిటికల్ సర్కిల్లో ఇదో చర్చ నడుస్తోంది. వైసీపీ ఎంపీ సంచలన వ్యాఖ్యలతో ఇది నిజమేనని తేలుతోంది. ఏకంగా ఓ వైసిపి సీనియర్ నాయకుడు ప్రగతి భవన్ లో కూర్చుని మంత్రాంగం నడిపినట్లు సదరు ఎంపీ ఆరోపిస్తున్నారు. దీంతో ఇదో హాట్ టాపిక్ గా మారింది. తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. మూడోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ కొట్టాలన్న కెసిఆర్ ప్రయత్నాన్ని తెలంగాణ ప్రజలు తిరస్కరించారు. కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. దీంతో తెర వెనుక రాజకీయాలు ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయి. ముఖ్యంగా పోలింగ్ ప్రారంభమవుతుందని.. నాగార్జునసాగర్ పై ఏపీ పోలీసులు దండయాత్ర చేశారు. ప్రజల్లో సెంటిమెంటు రగిల్చి కెసిఆర్ కు రాజకీయ లబ్ధి చేకూర్చాలని జగన్ ఈ ప్రయత్నానికి దిగినట్లు ఆరోపణలు వచ్చాయి. జగన్ అంతటితో ఆగలేదని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులకు నగదు సాయంతో పాటు ఎలక్షన్ క్యాంపెయిన్ కి అవసరమైన అన్ని రకాలుగా సహకరించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా జగన్ శిబిరంలో కీలక నేతగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రగతి భవన్ లో ఉంటూ ఎన్నికలను రిమోట్ చేసినట్లు కామెంట్స్ వినిపిస్తున్నాయి. 2018 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేసింది. కాంగ్రెస్, వామపక్షాలతో కూటమి కట్టి పోటీకి దిగింది. దీంతో సీఎం కేసీఆర్ కన్నెర్ర చేశారు. రిటర్న్ గిఫ్ట్ ఇస్తానని ప్రకటించారు. అందుకు తగ్గట్టుగానే 2019 ఎన్నికల్లో జగన్కు అంతులేని సాయం చేశారు. అప్పట్లో 1000 కోట్ల నగదు అందించినట్లు వార్తలు వచ్చాయి. కెసిఆర్ భావించినట్టే ఆ ఎన్నికల్లో చంద్రబాబు దారుణంగా ఓడిపోయారు. అధికారంలోకి వచ్చిన జగన్ కెసిఆర్ తో మంచి సంబంధాలు కొనసాగిస్తూ వచ్చారు. ఈ క్రమంలో తెలంగాణ ఎన్నికలు వచ్చాయి. కానీ ఎక్కడ బాహటంగా బీఆర్ఎస్ కు మద్దతు తెలపలేదు. లోపాయికారీగా కెసిఆర్ కు అన్ని విధాలా సహకారం అందించి.. గతంలో ఆయన చేసిన సాయానికి ప్రతి సాయం చేసినట్లు కామెంట్స్ వినిపిస్తున్నాయి.

తాజాగా ఈ విషయంలో వైసీపీ ఎంపీ రఘురామ కృష్ణంరాజు స్పందించారు. ప్రగతి భవన్లో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేసిన మంత్రాంగం తో పాటు నాగార్జునసాగర్ ఘటనను కూడా కేసీఆర్ కోసమే జగన్ చేయించారని ఆయన ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం రఘురామ కృష్ణంరాజు చేసిన సంచలన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# మాయమవుతున్న సీనరేజ్

అనంతపురం, డిసెంబర్ 6, :కంచే చేను మేస్తున్న చందంగా ఒక ప్రయివేట్ సంస్థ వ్యవహరిస్తోంది. కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేస్తున్న సీనరేజిని ప్రభుత్వానికి సక్రమంగా కట్టడం లేదు. పైగా, అక్రమంగా మట్టి తవ్వకాలు చేసి అమ్ముకుంటోంది. ఇదంతా బహిరంగంగా జరుగుతున్న గనుల శాఖ చోద్యం చూస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సీనరేజ్ వసూలు చేసే బాధ్యతను ఉమ్మడి అనంతపురం జిల్లాలో అమిగోస్ సంస్థకు ఈ ఏడాది మార్చి మూడు నుంచి అప్పగించింది. మట్టిని తవ్వుతున్న కాంట్రాక్టర్ల నుంచి సీనరేజ్ వసూలు చేసి నెలకు 10.50 కోట్ల చొప్పున గనుల శాఖకు చెల్లించాలి. కానీ, ఒప్పందం ప్రకారం ఆ సంస్థ ఏ నెల కూడా ఆ మేరకు చెల్లించిన దాఖలాలు లేవు. మట్టి తవ్వకాలకు ప్రభుత్వ పనులకు మాత్రమే తాత్కాలిక పర్మిట్లు ఇస్తారు. కాంట్రాక్టరు చేస్తున్న పనికి సంబంధించిన వివరాలను తీసుకుని పర్మిట్లు మంజూరు చేయాలి. అయితే, కాంట్రాక్టర్లకు బదులు అమిగోస్ సంస్థకు చెందిన కొంతమంది వారికే ఆ సంస్థ తాత్కాలిక పర్మిట్లు జారీ చేసినట్లు, తద్వారా లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని అక్రమంగా తరలించి అమ్ముకున్నట్లు ఆరోపణలు పెద్ద ఎత్తున వెల్లువెత్తుతున్నాయి. బుక్కరాయసముద్రంలో సర్వే నంబర్ 113, ఆత్మకూరు మండల కేంద్రంలో సర్వే నెంబరు 290, పెద్దపప్పూరు మండలం జూటూరులోని సర్వే నంబరు 1,281, పామిడి మండలం వంక రాజు కాలువ గ్రామం పరిధిలో సర్వే నెంబరు పేర్కొనకుండానే తాత్కాలిక పర్మిట్లు ఇచ్చింది. ఆత్మకూరులో రాజశేఖర్, వంకరాజు కాలువలో ప్రవీణ్‌కుమార్ పేరున ఇవి మంజూరయ్యాయి. అయితే, ఈ ఇద్దరికీ ఎక్కడా ప్రభుత్వ అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టులు లేవని సమాచారం. అయినా, హంపాపురం, నరసినేకుంట, బుక్కరాయసముద్రం, నరసాపురం, యల్లనూరు మండలాల్లో పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు వారు జరిపారు. వారిద్దరూ ఆ సంస్థకు సంబంధించిన వారేనని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తమకు తవ్వకాలకు అనుమతులు ఉన్నా తవ్వడానికి వీల్లేదంటూ అమిగోస్ సంస్థ ప్రతినిధులు అడ్డుపడుతున్నారని కొంతమంది లీజుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గనుల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని చెప్తున్నారు. లీజుదారుడిని అయినందున తవ్వకాలు జరపకున్నా సీనరేజీ చెల్లించాలంటూ అమిగోస్ సంస్థ ప్రతినిధులు ఒత్తిడి తెస్తున్నారంటూ గుంతకల్లులో 5వ వార్డు కౌన్సిలరు కుమారుడు దర్గా రమేష్ ఇటీవల ఆత్మహత్యానికి పాల్పడ్డారు. వీటిపై గనుల శాఖ ఇంఛార్జి డిప్యూటీ డైరెక్టర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. అమిగోస్ సంస్థకు సీనరేజ్ ఛార్జీలు వసూలు చేసే బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. దీన్ని సాకుగా తీసుకొని అక్రమంగా ఆ సంస్థకు సంబంధించిన ప్రతినిధులే తవ్వకాలను జిల్లాలో జరుపుతున్నారు. మట్టి అక్రమ తవ్వకాలపై ఉన్నతాధికారులకు సిపిఎం ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. సీనరేజ్ ఛార్జీలను వసూలు చేసే బాధ్యతను ప్రభుత్వం ప్రయివేటు సంస్థలకు అప్పగించడం సరైంది కాదు. అమిగోస్ సంస్థపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## ఇంట్రెస్టింగ్ ఫోటో షేర్ చేసిన నాని!




నాచురల్ స్టార్ నాని ప్రధాన పాత్రలో, డైరెక్టర్ శౌర్యువ్ దర్శకత్వం లో తెరకెక్కిన ఫీల్ గుడ్ మూవీ హాయ్ నాన్న డిసెంబర్ 7, 2023 న వరల్డ్ వైడ్ గా థియేటర్ల లో గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ చిత్రాన్ని హీరో నాని బాగా ప్రమోట్ చేస్తున్నారు. రిలీజ్ కి ఒక్క రోజే ఉండటం తో యుఎస్ లో కూడా ప్రమోట్ చేసేందుకు రెడీ అవుతున్నారు.హీరో నాని తాజాగా సోషల్ మీడియా లో ఒక ఫోటో ను షేర్ చేశారు. కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ ను హీరో నాని కలిశారు. హెూమ్ లాగా ఫీల్ అయ్యాను అంటూ చెప్పుకొచ్చారు నాని. థాంక్యూ అని అన్నారు. హీరో నాని శివ రాజ్ కుమార్ తో ఉన్న ఫోటో ను షేర్ చేశారు. ఇది ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతోంది.

## "నా సామిరంగ" ఫస్ట్ సింగిల్ లేటెస్ట్ అప్డేట్!




టాలీవుడ్ స్టార్ హీరో అక్కినేని నాగార్జున ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ మూవీ నా సామిరంగ. ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రేక్షకుల ముందుకి రానుంది. దర్శకుడు విజయ్ బిన్నీ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇటీవలి అప్డేట్‌లో, మేకర్స్ ఈ చిత్రం యొక్క మొదటి సింగిల్, ఎత్తుకెళ్లి పోవాలనిపిస్తుందే ను అనౌన్స్ చేశారు. ఈ రోజు, నాగార్జున నటించిన డైనమిక్ పోస్టర్ ను విడుదల చేయడం జరిగింది. ఇది ఫస్ట్ సింగిల్ ప్రోమో కి సంబంధించిన పోస్టర్. కీరవాణిచే చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ శుక్రవారమే ట్రాక్ విడుదల కానుందనేది బలమైన బజ్. అతి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస చిట్టూరితో నిర్మిస్తున్న నా సామిరంగ చిత్రంలో ఆశికా రంగనాథ్ కథానాయికగా నటిస్తోంది.

## ఇక మల్టీప్లెక్స్ లో మందు కూడా..




సినిమా థియేటర్లో జనాలను అట్రాక్ట్ చేయడానికి ఎన్నో రకాల ప్రయత్నాలు చేస్తూ ఉన్నాయి. అయితే సింగిల్ స్క్రీన్ థియేటర్స్ లో కాలం ఎంతవరకు ఉంటుందో కానీ మల్టీప్లెక్స్ థియేటర్లో మాత్రం ఇప్పుడు ఊహించని స్థాయిలో పెరిగిపోతున్నాయి. ఎక్కువగా అయితే మాల్స్ లోనే ఈ మల్టీప్లెక్స్ లు సరికొత్త తరహాలో రూపుదిద్దుకుంటున్నాయి. ఇక వెండితెరపై బెస్ట్ ఎంటర్టైన్మెంట్ ఇవ్వడమే కాకుండా ఆ చుట్టూ ప్రపంచంలో కూడా జనాల దృష్టిని ఆకర్షించేందుకు గట్టిగానే ప్రణాళికలు రచిస్తున్నారు. అనిపిస్తోంది ఇప్పటికే ఒక మల్టీప్లెక్స్ థియేటర్ సంస్థ ఆ తరహా ప్రణాళికను మొదలుపెట్టేసిందే. మల్టీప్లెక్స్ చైన్ పివిఆర్ ఐనాక్స్ ముంబైలో ఇటీవల జియో వరల్డ్ సెంటర్ లో జియో వరల్డ్ ప్లాజాలో 6 స్క్రీన్ల సముదాయాన్ని ప్రారంభించింది. 790 సీట్ల తో ఖరీదైన ఇంటీరియర్స్ తో లగ్జరీ ఫీల్ ను ఇచ్చేలా రంగం సిద్ధం చేశారు. దేశంలోనే బెస్ట్ మల్టీప్లెక్స్ గా దీన్ని రెడీ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఇక లేజర్ టెక్నాలజీ కూడిన బెస్ట్ ఐమ్యాక్స్ స్క్రీన్ కూడా ఉంది. భారత్ లోనే ఫస్ట్ టైమ్ అనిపించే చాలా విశేషాలు ఇందులో ఉన్నాయి. ఇక మొదటి సారి బార్ అండ్ లాంజ్ ఏర్పాటుగా సిద్ధం చేస్తున్నారు. ఇక సినిమా చూస్తూ కూడా మందు వేయవచ్చు అని తెలుస్తోంది. ఇండియాలో టాప్ మిక్సాలాజిస్ట్ గా క్రేజ్ అందుకున్న శాంతను చందా ప్రత్యేకంగా తయారు చేసే కాక్ టైల్స్ ని ఇక్కడ పుచ్చుకోవచ్చు. అలాగే ఈ మల్టీప్లెక్స్ లో ఫుడ్ కూడా చాలా హై లెవెల్లో ఉండనుంది. టాప్ సెలబ్రిటీ చెఫ్స్ సారా టాడ్, విక్కీ రత్నాని, యుటాకా సైటో, మయాంక్ తివారి వంటి స్పెషలిస్ట్ ల చేత ఫుడ్ మెనూ ఉండబోతోంది. ప్రత్యేక మెనూ ద్వారా ఎంపిక చేసిన ఆహార పదార్థాలు సర్వ్ చేయనున్నారు. లైవ్ కుకింగ్ కౌంటర్ కూడా ఉంటుంది. మనం చూస్తుండగానే మన సూచనల మేరకు ఖచ్చితమైన పద్ధతుల్లో రెడీ చేయడం జరుగుతుంది ఇక మొదట రణబీర్ కపూర్ యానిమల్ సినిమా షో ద్వారా ఈ మల్టీప్లెక్స్ స్టార్ట్ అయ్యింది. ఇక ఈ థియేటర్ కు వెళితే మాత్రం రెండున్నర గంటల సినిమాలు చూసేందుకు కొనే టికెట్ కన్నా నాలుగైదింతలు ఎక్కువగా ఫుడ్ కోసం ఖర్చు చేయాల్సిన అవసరం ఉందని అనిపిస్తుంది. ఇక లేటెస్ట్ గా కొత్తగా మందు కూడా సెట్ చేయడంతో నార్మల్ ఆడియన్స్ రావడం అంటే ఆస్తులు తాకట్టు పెట్టాల్సిందే.


## జోరుగా హుషారుగా ట్రైలర్.. ఎలా ఉందంటే..




'బేబీ' సినిమాతో నటుడిగా మంచి గుర్తింపు అందుకున్న నటుడు విరాజ్ అశ్విన్ కథానాయకుడిగా నటించిన లేటెస్ట్ మూవీ 'జోరుగా హుషారుగా'. పూజిత పొన్నాడ హీరోయిన్ గా నటించిన ఈ యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ కు అను ప్రసాద్ దర్శకత్వం వహించారు. ఇక శిఖర అక్షర ఆర్ట్స్ బ్యానర్ లో నిరీష్ తిరువీదుల ఈ సినిమాను నిర్మిస్తున్నారు. డిసెంబర్ 15న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది. ఇక 'ఉప్పెన' తో బాక్సాఫీస్ హిట్ సొంతం చేసుకున్న సంచలన దర్శకుడు బుచ్చిబాబు సానా చేతుల మీదుగా ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్‌ను విడుదల చేసిన బుచ్చిబాబు సినిమా కంటెంట్‌ను మెచ్చుకున్నారు. అలాగే విరాజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్ వివరాల్లోకి వెళితే సాయి కుమార్ సింపుల్ క్యారెక్టర్ తో ఆస్తుల కంటే మనుషుల బంధం గొప్పది అని అర్థవంతమైన డైలాగ్ తో హైలెట్ చేశారు. ఇక మిడిల్ క్లాస్ ఆశలతో ఉండే అతని కొడుకు విరాజ్ క్యారెక్టర్ తన ఆఫీసులోనే మరొక అమ్మాయితో ప్రేమలో పడే సన్నివేశాలు కూడా ఇందులో మేజర్ గా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఇక ఆ ప్రేమలో అతనికి ఎదురైన చాలెంజ్ లు కుటుంబంలో కూడా ప్రభావం చూపుతాయని అర్థమవుతుంది. ఇక తండ్రి కొడుకులు మధ్యలో ఉండే బంధం ఏమిటి అలాగే అతని ప్రేమతో వచ్చిన ఇబ్బందులు ఏంటి అని అంశాలు సినిమాలో ఉండబోతున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ తో పాటు మంచి లవ్ స్టోరీ అలాగే కామెడీ కూడా హైలెట్ కాబోతున్నట్లు ట్రైలర్ ద్వారా క్లారిటీ ఇచ్చేశారు. సినిమాలో బ్రహ్మాజీ పోషించినారు చర్చి ఫాదర్ క్యారెక్టర్ బాగా నవ్విస్తుందని అర్థం అవుతుంది.

రొమ్-కామ్ సన్నివేశాలలో మధునందన్ కూడా ఉన్నారు. సిరి హనుమంతు మరో సిటీ అమ్మాయిగా నటించారు. ఇక ఇది చెప్పుకోదగ్గ థియేట్రికల్ హిట్ అవుతుందని హీరో విరాజ్ ఆశిస్తున్నాడు. ఇక డిసెంబర్ 15న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. మరి ఈ సినిమా ఆడియెన్స్ ను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

## మరో హీరోయిన్ డీప్ ఫేక్ వీడియో వైరల్.. షాకింగ్



టెక్నాలజీ ఎంతగానో అభివృద్ధి చెందుతుంది కానీ.. ఈ క్రమంలో యువతను చెడు త్రోవ పట్టించే టెక్నాలజీ కూడా మరింత భయాన్ని కలిగిస్తోంది. సోషల్ మీడియాలో ఇప్పటికే ఎన్నో రకాల ఏఐ డీప్ ఫేక్ టెక్నాలజీ తో వీడియోలు భయాన్ని కలిగించేలా వైరల్ అవుతూ ఉన్నాయి. అయితే రోజురోజుకు వీటి తీవ్రత ఇంకా ఏ స్థాయిలో ఉంటుందో అనే విధంగా కూడా ఆందోళనను కలిగిస్తోంది. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం కూడా చాలా సీరియస్ అయింది. వెంటనే కేసులు నమోదు చేసి అందుకు కారణమైన వారిపై చర్యలు కూడా తీసుకుంటున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అని మరి కొంతమంది సెలబ్రిటీలు సూచిస్తున్నారు. రష్మిక మందన ఆలియా భట్ డీప్ ఫేక్ వీడియోలు తరహాలోనే ఇప్పుడు మరొక హీరోయిన్ డీప్ ఫేక్ వీడియో కూడా ఇంటర్నెట్ ప్రపంచంలో వైరల్ గా మారుతుంది. ప్రముఖ బాలీవుడ్ హీరోయిన్ ప్రియాంక చోప్రాకు సంబంధించిన ఒక డీప్ ఫేక్ వీడియో ఊహించిన విధంగా సోషల్ మీడియాలో గత కొన్ని గంటలుగా చక్కర్లు కొడుతోంది. మొన్ననే కొంతమంది హీరోయిన్స్ ఇలాంటి వీడియోలతో చాలా ఇబ్బంది పడ్డారు అని అర్థమైంది. తప్పనిసరిగా ఇలాంటి వాటిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు ప్రభుత్వాలు సీరియస్ గా స్పందించినప్పటికీ కూడా మళ్లీ మరొక హీరోయిన్ ఫేస్ తో ఈ విధంగా వీడియోలు వైరల్ అవ్వడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. భవిష్యత్తులో మళ్లీ ఇంకా ఎలాంటి వీడియోలు వస్తాయో అని కూడా కొందరిలో ఆందోళనను కలిగిస్తోంది. కేవలం సెలబ్రెటీలు మాత్రమే కాకుండా సాధారణ మహిళలు కూడా ఈ డిప్ ఫేక్ టెక్నాలజీ కారణంగా చాలా ఆందోళనకు గురి అవుతున్నారు. ఈ విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకొని జాగ్రత్త పడాల్సిన అవసరం అయితే ఉంది. ఇక అమితాబ్ బచ్చన్, విజయ్ దేవరకొండ అలాగే మరికొందరు సినిమా హీరోయిన్స్ టెక్నీషియన్స్ కూడా ఈ తరహా టెక్నాలజీపై అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.



## అక్క-చెల్లి మధ్య చాలా వ్యత్యాసమే ఉందండోయ్!



బాలీవుడ్ సిస్టర్స్ జాన్వీకపూర్-ఖుషీ కపూర్ ఇన్ స్టా సంచలనాల గురించి చెప్పాల్సిన పనిలేదు. జాన్వీ స్టార్ అయినా తగ్గలేదు. ఖుషీ కపూర్ తెరంగేట్రానికి ముందు ఇన్ స్టాని షేక్ చేస్తుంది. ఎప్పటికప్పుడు కొత్త ఫోటోలతో అక్కాచెల్లెళ్లిద్దరు సెగలు పుట్టిస్తుంటారు. కలిసొచ్చినా..కలిసి రాకపోయినా ఇన్ స్టాని హీటెక్కించడంలో ఒకరికొకరు పోటీ పడతారనడంలో సందేహం లేదు. మరి అతిలోక సుందరి శ్రీదేవి రక్తం పంచుకున్న సిస్టర్స్ ఇద్దరిలో కామన్ ఫీచర్స్ ఏమైనా ఉన్నాయా? అంటే పెద్దగా కనిపించవు. అంటే అక్క కన్నా చెల్లెలే ఎక్కువ ఎత్తు అని తెలుస్తోంది. తాజాగా ఖుషీ కపూర్ ఫోటో ఒకటి ఇన్ స్టాలో వైరల్ అవుతుంది. అందులో అమ్మడు చిట్టి పొట్టి దుస్తుల్లో కనిపిస్తుంది. బ్లాక్ అండ్ బ్లాక్ కాంబినేషన్ లో కుషీ కపూర్ చూపరులను ఆకట్టుకుంటుంది. ఆ దుస్తులే జాన్వీ..ఖుషీ మధ్య ఎత్తు వ్యత్యాసాన్ని గుర్తు చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ అవుతుంది. జాన్వీ పాత ఫోటోల్ని...ఖుషీ కొత్త ఫోటోని పక్కపక్కన బెట్టి పోలికలు..కొలతలు కంపారిజన్ చేస్తున్నారు నెటి జనులు. అన్ని విషయాల్లో అక్కాచెల్లి మధ్య చాలా వ్యత్యాసమే ఉందంటున్నారు. హైట్ కూడా మ్యాచ్ అవ్వడం లేదని క్లారిటీ వచ్చేసింది. ఇక ఖుషీ కపూర్ హీరోయిన్ గా ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అవుతంది. 'ది అర్చీస్' వెబ్ సిరీస్ అనేది అమ్మడిని పూర్తి స్థాయిలో లాంచ్ చేసే చిత్రం కాదు. దీంతో బోనీ కపూర్ చిన్న కుమార్తె విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. జాన్వీ విషయంలో దొర్లిన తప్పిదాలు ఖుషీ విషయంలో రిపీట్ కాకుండా జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది.

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16. and SREE SESHASAI ENTERPRISES "D.NO : 3-88, "C/O CHANDRA THEATER," GOSALA VILLAGE, "MAIN ROAD, PENAMALURU MANDAL, KRISHNA DT, ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com
PIN: 521151."MOBILE :9912333140 Email : sreeseshasaivja@gmail.com.